ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5

తిరుపతి

జిల్లా వార్తలు

బుధవారం 2 ఏప్రిల్ 2025








● మరో రెండు నెలల్లో

తిరుపతి కొత్త రైల్వే స్టేషన్ అందుబాటులోకి

నయా స్టేషన్ ఆగయా

● తుదిమెరుగులు దిద్దుకుంటున్న దక్షిణంవైపు నిర్మాణాలు

● వచ్చే ఏడాది జూన్‌లో ఉత్తరంవైపు భవనం పూర్తి



నూతన భవనంలో ఏర్పాటు చేస్తున్న ఎస్కలేటర్

తిరుపతి, (సెంట్రల్), ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో దక్షిణ వైపు నిర్మిస్తున్న నూతన భవనం అందుబాటులోకి రానుంది. రూ.300కోట్లతో వరల్డ్ క్లాస్ రైల్వేస్టేషన్‌గా తిరుపతిని మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే శ్రమిస్తోంది. దక్షణవైపు తుదిదశకు చేరుకున్న నిర్మాణాలను రైల్వే అధికారులు మీడియా ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. 'దక్షిణమధ్య రైల్వేకు చెందిన ప్రధాన రైల్వే స్టేషన్లు సికింద్రాబాద్, నెల్లూరు, తిరుపతిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటిలో తిరుపతిలో మరింత వేగంగా పనులు జరుగుతున్నాయి. తిరుపతి రైల్వే స్టేషన్ అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం రూ.300కోట్లతో పనులు ప్రారంభించింది. ప్రస్తుతం తిరుపతి రైల్వే స్టేషన్లో 80వేల మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్తులో 1.5 లక్షల మంది రాకపోకలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ నిర్మాణాలు చేపడుతున్నాం. ఇప్పటికి 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఉత్తరంలో నిర్మిస్తున్న పనులు వచ్చే ఏడాది జూన్‌లోపు పూర్తవుతాయి. ప్రస్తుతం తిరుపతి రైల్వే స్టేషన్లో ఆరు ప్లాట్ ఫాంలు ఉన్నాయి. మరో రెండు పెంచేందుకు ప్రతిపాదనలు పంపాం' అని వివరించారు. ఈ సమావేశంలో స్టేషన్ మేనేజర్ డాక్టర్ చిన్న రెడ్డెప్ప, ఏడీఈఎం ప్రభాకర్, పీఎంసీ నిర్మల్ కుమార్, కాంట్రాక్టర్ సంజయ్ కఠారే, ఆర్కే సింగ్, ఐపీఎఫ్ సందీప్ కుమార్, జీఆర్పీ సీఐ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకతలివీ

ప్రస్తుతం నిర్మిస్తున్న జీ+3 భవనాల్లో (ఉత్తర-దక్షిణ భవనాలను కలుపుతూ) రెండు ఎయిర్ కాన్ కోర్సులు ఏర్పాటు చేశారు. వీటికి అనుసంధానంగా 12 ఎస్కలేటర్లు, 10 లిఫ్టులు పనిచేస్తాయి. వీటితో పాటు ప్రస్తుతమున్న రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు కూడా ఉంటాయి. దక్షిణ దిక్కున కొత్త భవనంలోని అండర్ గ్రౌండ్‌లో 400 వాహనాలు పార్కింగ్ చేసుకునే సౌకర్యం ఉంది.

గ్రౌండ్ ఫ్లోర్: టికెట్ బుకింగ్ కౌంటర్లు, రిజర్వేషన్ కౌంటర్లు, ప్రయాణికుల విశ్రాంత గదులు, రైల్వే ఆపరేటింగ్ ఉద్యోగుల కార్యాలయాలు, ఎస్ఎంఆర్, ఏఎస్ఎం కార్యాలయాలు, వీఐపీ లాంజ్‌లు, క్లాక్ రూంలు ఉంటాయి.

ఫస్ట్ ఫ్లోర్: విశ్రాంత గదులు, ఫుడ్ కోర్టులు, దుకాణాలు

సెకండ్ ఫ్లోర్: రైల్వే విభాగాల కార్యాలయాలు, రిటైరింగ్ గదులను (ఆరు లిఫ్టులు, నాలుగు ఎస్కలేటర్లు) అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ నూతన భవనంపై మరో 7 అంతస్థులు పీపీపీకింద విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టులు నిర్మాణాలు చేపట్టే యోచనలో ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తదితరులు

రెండో ఉచిత సిలిండర్‌కు బుకింగ్స్

● నాలుగు నెలల వ్యవధిలో పొందే సౌలభ్యం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దీపం-2 కింద రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ ఒకటి నుంచి జూలై ఒకటవ తేదీ వరకు ఈ ఉచిత రెండో సిలిండర్‌ను బుక్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4,92,302 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అక్టోబరు 29 నుంచి మార్చి 31వ తేది వరకు తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కల్పించగా.. దాదాపు 4.74 లక్షల మంది వినియోగించుకున్నారు. వారిలో ఇప్పటి వరకు 4.58 లక్షల మందికి మాత్రమే సిలిండర్ రాయితీ నగదు బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఇక, రెండో సిలిండర్ బుకింగ్ మంగళవారం మొదలవగా.. తొలిరోజే దాదాపు 700 సిలిండర్లు బుక్ అయినట్లు సమాచారం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలలకు ఒకటి చొప్పున.. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను ఇస్తోంది. రేషన్ కార్డు ఉన్న వారందరూ అర్హులే. కాగా, వినియోగదారులు నగదు చెల్లించి సిలిండరును తీసుకున్న 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లోకి ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది. అయితే మొదటి సిలిండర్‌కు సంబంధించి జిల్లాలో ఇంకా దాదాపు 16 వేల మందికి నగదు జమ కాలేదు. దీనికి కారణం చాలా మంది ఈకేవైసీ చేసుకోక పోవడం, మరికొందరు బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడమేనని అధికారులు అంటున్నారు. అలాగే, ఒకే కార్డుపై రెండు గ్యాస్ సిలిండర్లు ఉన్నా డబ్బులు పడవని అంటున్నారు. వీటిని అధిగమిస్తే వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని చెబుతున్నారు. వీటికి సంబంధించి అనుమానాలుంటే 1967 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చు.

రూ.2.63 లక్షల పింఛను సొమ్ముతో పరార్

● సచివాలయ ఉద్యోగిని సస్పెండు చేసిన కలెక్టర్

సత్యవేడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ఇవ్వాల్సిన పింఛను సొమ్ముతో సచివాలయ ఉద్యోగి పరారైన ఘటన సత్యవేడు మండలంలో మంగళవారం జరిగింది. తన పరిధిలోని లబ్ధిదారులకు పింఛను అందజేసేందుకు కాళమనాయుడుపేట సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ షాహిదుల్లా సోమవారం కార్యాలయం నుంచి రూ.2,63,000 తీసుకున్నాడు. ఈ సొమ్మును కొత్తమారికుప్పంలో 63 మందికి పంపిణీ చేయాలి. మంగళవారం ఉదయం 11 గంటలవుతున్నా లబ్ధిదారులకు నగదు అందలేదు. ఈ విషయం తెలిసి షాహిదుల్లాకు ఎంపీడీవో చంద్రశేఖర్ ఫోను చేయగా స్విచ్ఆఫ్ వచ్చింది. అతడి గురించి పలు చోట్ల విచారించినా ఆచూకీ లేదు. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, షాహిదుల్లా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటాడని గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదులందాయి. రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం, అధికారులతో ప్రవర్తన సరిగా లేకపోవడం, విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం,శాఖాపరమైన పథకాల అమల్లో నిర్లక్ష్యం తదితర అంశాలపై పలుమార్లు ఆయన్ను ఉన్నతాధికారులు హెచ్చరించినా మార్పు రాలేదు.కాగా, పింఛన్ సొమ్ము పంపిణీ చేయకుండా, నగదు దుర్వినియోగం చేసిన షాహిదుల్లాను పెండింగ్ ఎంక్వైరీ కింద సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు అతడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పింఛన్ల పంపిణీలో జిల్లాకు మొదటిస్థానం

● 96.42 శాతం పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో ఈనెల కూడా రాష్ట్రంలో జిల్లాకు మొదటిస్థానం లభించింది. ఎల్-1 ఆర్‌డీ పరికరాలతో సచివాలయ సిబ్బంది మంగళవారం పింఛన్లు పంపిణీ చేయడంతో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తలేదు. జిల్లాలో 2,61,841మంది కిగాను తొలిరోజు 2,52,462 మందికి (96.42శాతం) పింఛన్లు అందజేశారు. 691 సచివాలయాల పరిధిలో సుమారు 5,700మంది సిబ్బంది ఉదయం 7గంటల నుంచి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

నారాయణవనం, ఆంధ్రజ్యోతి: డీఆర్డీఏ పీడీ శోభన్ బాబుతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం నారాయణవనంలో పింఛన్ల పంపిణీని తనిఖీ చేయడమే కాకుండా పంపిణీ చేశారు. జిల్లా ఇన్‌చార్జి అధికారి కోన శశిధర్ వీడియో కాల్ ద్వారా లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ జయరాములు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నారాయణవనంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

పన్ను వసూళ్లలో 'తిరుపతి' రికార్డ్

2024-25 ఆర్థిక సంవత్సరంలో మున్సిపల్ ఖాతాలోకి రూ.100 కోట్లు

తిరుపతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలక సంస్థకు రికార్డు స్థాయిలో పన్నులు వసూలయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను వివిధ రకాల పన్నుల కింద రూ.100కోట్లు జమయ్యాయి. 2023-24లో దాదాపు రూ84కోట్లు మాత్రమే వసూలైంది. ఈసారి రూ.వంద కోట్ల మార్కు దాటడంతో పాటు పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలో తిరుపతి మూడో స్థానంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. పన్నుల వసూళ్లలో కమిషనర్ మౌర్య, అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టడం, ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీని పన్నుదారులు పెద్దఎత్తున వినియోగించుకున్నారు. ఇక, తిరుపతి నగరంలో ఖాళీ స్థలాల పన్నులు (వీఎల్టీ) చెల్లించడం తొలి నుంచీ వెనుకంజలో ఉంది. ఎంత ఒత్తిడి చేసినా రూ4కోట్లు పైన వసూలైన సందర్భాలు లేవు. వీఎల్టీలపైన కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఖాళీ స్థలాల యజమానులు స్పందించకపోతే ప్రభుత్వ స్థలమని బోర్డులు పెట్టాలని అధికారులను ఆదేశించారు. వీఎల్టీ చెల్లించకుండా టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు నిబంధనలు ఒప్పుకోవని చెప్పడంతో ఈఏడాది దాదాపు రూ10కోట్లు వీఎల్టీ వసూలైందని కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ, టీటీడీ పన్నులు అటుంచితే.. ప్రైవేట్ ఆస్తులనుంచి బకాయిలతో పాటు రావాల్సిన దాదాపు రూ98కోట్ల పన్నులలో ఆర్థిక సంవత్సరం ముగింపునాటికి 97.5శాతం వసూలు కావడం విశేషం.

వసూలైన పన్ను వివరాలు

ఆస్తిపన్ను: రూ80.44కోట్లు

ఖాళీస్థలాల పన్ను (వీఎల్టీ): రూ9.92కోట్లు

నీటి పన్ను: రూ8.18కోట్లు

మురుగునీటి పన్ను: రూ1.50కోట్లు



అమ్మతో ఆనందంగా..



స్నేహానికి గుర్తుగా సెల్ఫీ

పరీక్షలు అయిపోయాయోచ్..!

● సందడి చేసిన టెన్త్ విద్యార్థులు

● రేపటి నుంచి మూల్యాంకనం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజున సోషల్ పరీక్ష అయిపోగానే.. ఆయా పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు సందడి చేశారు. కేరింతలు కొడుతూ... తల్లిదండ్రులను సంతోషంగా హత్తుకుంటూ ఆనందం పంచుకున్నారు. తొలి షెడ్యూల్ ప్రకారం సోమవారంతోనే పరీక్షలు ముగియాలి. కానీ, 31వ తేదీన రంజాన్ రావడంతో ఆరోజున ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటిస్తూ పరీక్షను మంగళవారానికి వాయిదా వేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 310 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 15,455 మంది విద్యార్థులు, 283 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 11,548 విద్యార్థులు, మరో 634 మంది ప్రైవేటు విద్యార్థులు మొత్తం 28,656 మంది పదోతరగతి పరీక్షలు రాశారు. వీరి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు జరగనుంది. ఒకవేళ పేపర్లు కాస్త ఎక్కువగా వస్తే ఆపైకూడా ఒకట్రెండు రోజులు మూల్యాంకనం జరిగే అవకాశం ఉంది. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో వారం రోజులపాటు జరిగే మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్లను నియమించారు. ఒక ఎగ్జామినర్ ప్రతిరోజూ 40 పేపర్లను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది.



విద్యార్థుల కేరింత

అంతర్రాష్ట్ర దొంగ పరార్

● విషయాన్ని బయటకు పొక్కనీయని రేణిగుంట అర్బన్ పోలీసులు

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

రేణిగుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నుంచి అంతర్రాష్ట్ర దొంగ పరారైన ఘటన మంగళవారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం వారపు సంతలో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న ఓ వ్యక్తిని ఐడీ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న కౌన్సెలింగ్ భవనంలో అతడిని విచారించారు. నిందితుడి వేలిముద్రలను పరిశీలించగా.. అతడిపై కర్ణాటకలో 47 చోరీ కేసులు ఉండటం, ఆ రాష్ట్రంలో మోస్ట్ వాంటెడ్ దొంగగా ఉండడాన్ని గుర్తించి బెంగళూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత ఏమైందోగానీ శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో దొంగ పరారయ్యాడని తెలిసింది. మరోవైపు రేణిగుంటకు చేరుకున్న కర్ణాటక పోలీసులు.. అర్బన్ పోలీసులతో కలిసి నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో పోలీసుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీనిపై డీఎస్పీ శ్రీనివాసరావును వివరణ కోరగా.. కర్ణాటక రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ దొంగ రేణిగుంట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమైనట్లు చెప్పారు. అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించగా రాత్రి తప్పించుకొనిపోయాడన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్-2

తిరుపతి(విద్య), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్- 2 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 2 4వ తేదీ వరకు, ఆ తర్వాత 7 నుంచి 9వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. తిరుపతి చెర్లోపల్లి సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్ కేంద్రంగా ప్రతీరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లుగా పరీక్షలు జరుగుతాయని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టీఏ) సిటీ కోఆర్డినేటర్ టి. కైలాష్‌నాథ్ తెలిపారు. తొలి మూడు రోజుల్లో జరిగే పరీక్షలకు సుమారు 3వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి రోజు రెండు సెషన్లలో 1,156 మంది పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం సెషన్‌కు వచ్చే విద్యార్థులు 7 గంటలకే పరీక్ష కేంద్రంవద్దకు చేరుకోవాలి. 8.30 గంటలకే కేంద్రం గేట్లు మూసివేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే పరీక్ష కోసం విద్యార్థులు 12 గంటలకే కేంద్రం వద్దకు చేరుకోవాలి. 1.30 గంటలకు గేట్లు మూసివేస్తారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నకిలీ సర్టిఫికెట్ల ముఠాపై విచారణ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాస్పత్రిలో కొందరు సిబ్బంది గతంలో పని చేసి వెళ్లిన అధికారులు, డాక్టర్ల పేరుతో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయిస్తుండటంపై అధికారులు విచారణ చేపట్టారు. ఇక్కడ నకిలీ మెడికల్, సదరం సర్టిఫికెట్ల జారీపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో రుయాలో నకిలీ సర్టిఫికెట్ల ముఠా శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై పూర్తి స్థాయిలో విచారించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ రుయా అధికారులను ఆదేశించడంతో మంగళవారం విచారణ చేపట్టారు. ఎంఆర్‌డీ విభాగంలోని కొందరు సిబ్బందిని పిలిచి మందలించినట్లు సమాచారం.

చంద్రగిరి

రైతులకు సబ్సిడీపై మామిడికాయల కవర్లు


మామిడికాయలకు కవర్లు కడుతున్న దృశ్యం

రామచంద్రాపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కవర్లతో నాణ్యమైన మామిడికాయలు వస్తాయని ఉద్యానశాఖ అధికారి సునీల్ అన్నారు. మంగళవారం మండలంలోని అనుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 4వేల ఎకరాల్లో మామిడి సాగవుతోందన్నారు. అధిక ఉష్ణోగ్రతలు, చీడపీడల వలన బేనీషా రకంలో పూత అధికంగా వచ్చినా పిందె కట్టలేదన్నారు. పూత, పిందెలు రాలుతున్నాయన్నారు. దీని నివారణకు 19-19-19 లేదా 13-0-45 10 గ్రాములు, ప్లానోఫిక్స్ 0.25మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తేనె మంచుపురుగు, తామర పురుగులు, పంటల మీద బంక నివారణకు టాటా ఓడిస్ 1గ్రామ, సాఫ్ 1గ్రాము, వేపనూనె 3మి.మీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం నిలబడిన కాయలు కోడిగుడ్డు సైజులో ఉన్నాయన్నారు. వీటికి కవర్లు కడితే తామరపురుగు, బంక, తేనేమంచు పురుగు, పండు ఈగలను సమర్థవంతంగా ఎదుర్కొవచ్చన్నారు. గ్రామంలో గిరి అనే రైతు 12వేల కవర్లను కట్టించారు. ఆసక్తి ఉన్న రైతులకు 50శాతం రాయితీతో కవర్లను అందిస్తున్నట్లు సునీల్ తెలిపారు. ఇందుకు రైతు సేవాకేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

జోరుగా జాతీయ రహదారి విస్తరణ పనులు



తిరుపతి రూరల్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని పూతపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సి.మల్లవరం నుంచి తనపల్లె సర్కిల్ సమీపం వరకు రహదారికి రెండువైపులా ఎన్‌హెచ్ ఆధ్వర్యంలో గుర్తించిన హద్దులవరకు మొక్కలను తొలగించి శుభ్రం చేస్తున్నారు. కొన్నిచోట్ల మట్టితోలి యంత్రాలతో చదును చేస్తున్నారు. తుమ్మలగుంట, పేరూరు, గాంధీనగర్ పరిధిలో పనులు మరింత ఊపందుకున్నాయి. ఈరహదారిలో ఎక్కువ మంది రోజూ తిరుపతికి వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. విస్తరణ పనుల నేపథ్యంలో ఇవేగం తగ్గించి జాగ్రత్తగా వాహనాలు నడపాల్సిన అవసరం ఉంది. స్థానికులు కూడా సక్రమ మార్గంలోనే వాహనాలతో వెళ్లాలని పలువురు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


ధ్వజస్తంభాన్ని నీటితో శుద్ధి చేస్తున్న అధికారులు

చంద్రగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోదండరామస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమజనం నిర్వహించారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక 6 నుంచి 9 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రిని నీటితో శుద్ధి చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాల పవిత్ర మిశ్రమంతో ఆలయంలో ప్రోక్షణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈనెల 6 నుంచి 14 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 5వతేదీ సాయంత్రం అంకురార్పణతో వేడుకలు ప్రారంభం కానున్నాయి.

అప్పలాయగుంటలో నేటి నుంచి ధ్వజస్తంభ సంప్రోక్షణ


అంకురార్పణ నిర్వహిస్తున్న వేదపండితులు

వడమాలపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయ గుంటలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 2వ తేది నుంచి మూడు రోజుల పాటు నూతన ధ్వజస్తంభ సంప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల్లోగా అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 8 నుంచి 11.15 గంటల వరకు వైదిక కార్యక్రమాలు, వాస్తు హోమం, సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కళాపకర్షణ నిర్వహించనున్నారు. ఈనెల 3న యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు జీవ ధ్వజస్తంభం మహాశాంతి అభిషేకం, పూర్ణాహుతి జరగనుంది. 4న యాగశాలలో వైదిక కార్యక్రమాల అనంతరం మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఈవో శ్రీవాణి తెలిపారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న తహసీల్దారు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తొట్టంబేడు తహసీల్దారు మధు సూదన్‌రావు హెచ్చరించారు. తొట్టంబేడు పంచాయతీ రామచంద్రాపురంలోని సర్వేనెం.89/1లో 1.24ఎకరాల గుంట భూమి ఉంది. దీనిపై అక్రమార్కులు కన్నేశారు. కబ్జాదారుల నుంచి కాపాడేందుకు మంగళవారం తహసీల్దారు సిబ్బందితో కలిసి సంబంధిత భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఈ భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందిందని తెలిపారు.

మొరాయించిన స్కూల్ బస్సు: ఎండలో విద్యార్థుల తిప్పలు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూల్ బస్సు నడిరోడ్డులో మొరాయించింది. మండుటెండలో విద్యార్థులే బస్సును తోసుకుంటూ ముందుకు జరపాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఘటన పట్టణంలోని జయరామరావువీధిలో జరిగింది. స్థానిక ప్రజలు పాఠశాలల బస్సుల కండీషన్‌పై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. కాగా దీనిపై పోలీసులు సంబంధిత పాఠశాల నిర్వాహకులు, డ్రైవర్‌ను పిలిపించి హెచ్చరించి పంపారు.

బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకోండి


ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ స్వాతికి సీపీఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ లైసెన్సు ఉన్న మద్యం దుకాణాలనుంచి ప్రతి పల్లెకు విచ్చలవిడిగా మద్యం యథేచ్ఛగా విక్రయిస్తున్నారన్నారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించిన సీఎం చంద్రబాబు మాటలను కూడా పెడచెవిన పెట్టి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ అధికారులు, కలెక్టర్ స్పందించి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బెల్టు దుకాణాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శివకుమార్, శ్రీనివాసులు, ప్రజానాట్య మండలి నాయకులు చారుశీల, గురవయ్య, ఏఐటీయూసీ నాయకులు మురళి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో చోరీ

● 90 గ్రాముల బంగారం,500గ్రాముల వెండి అపహరణ

మంగళం, ఏప్రిల్ 1,(ఆంధ్రజ్యోతి): మంగళంలోని తుడా క్వార్టర్స్‌లో ఉంటున్న ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో దొంగలుపడ్డారు. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా..ఆర్టీసీలో పనిచేస్తున్న వెంకటరాజు కుటుంబం తుడా క్వార్టర్స్‌లో ఉంటోంది. ఇటీవల తమ సమీప బంధువుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి గుంటూరు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు వారి ఇంటి తాళాలు తొలగించి లోపలికి చొరబడ్డారు. బీరువాలోని 90గ్రాముల బంగారం,500గ్రాముల వెండి,కొంత నగదు అపహరించుకుపోయారు. మంగళవారం ఊరి నుంచి తిరిగి వచ్చిన వెంకటరాజు కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని అవాక్కయ్యారు. ఇంటి తాళాలు తెరుచుకుని ఉండటంతో ఒక్కసారిగా ఆందోళన చెందారు. లోపలికి వెళ్లి చూసేసరికి దొంగతనం జరిగిందని గుర్తించారు. వెంటనేవెళ్లి మంగళం ఔట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ జగన్నాథరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గడచిన నెలరోజుల్లో ఇదే ప్రాంతంలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి


గురుమూర్తి

వి.కోట, ఏప్రిల్ 1(ఆంధ్ర జ్యోతి): వి.కోట - పలమనేరు ప్రధాన రహదారిలో రాఘవపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాకాలకు చెందిన గురుమూర్తి (54) అనే ఉపాధ్యాయుడు మృతి చెందారు.మండల కేంద్రమైన పాకాల సమీపంలోని గుట్టకిందఇండ్లకు చెందిన గురుమూర్తి రామకుప్పం మండలం కంచిదాసనపల్లెలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వరుస సెలవులుండడంతో స్వగ్రామానికి వెళ్లి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై రామకుప్పానికి వస్తుండగా రాఘవపల్లె వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గాయాలతో కిందపడి ఉన్న ఆయన్ను స్థానికులు అంబులెన్స్ ద్వారా వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పడంతో ఆస్పత్రి వద్దకు చేరుకున్న సహచర ఉపాధ్యాయులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో 6న శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 6న శ్రీరామనవమి ఆస్థానాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయక మండపంలో శ్రీసీతాలక్ష్మణ సమేత హనుమంతుల వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంతవాహన సేవ జరుగనుంది. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య బంగారువాలికిలో శ్రీరామనవమి ఆస్థానం నిర్వహిస్తారు. మరుసటి రోజు సోమవారం రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య శ్రీరామపట్టాభిషేకాన్ని నిర్వహిస్తారు.

డైట్‌లో అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో డిప్యుటేషన్‌పై అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పని చేస్తున్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుకు 58 ఏళ్లలోపు ఉన్నవారే అర్హులన్నారు. ఇతర వివరాలకు డైట్‌లో సంప్రదించాలని సూచించారు.

చిత్తూరులో తగ్గిన ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజోతి):పగటి ఉష్ణోగతలు మంగళవారం తగ్గాయి. 40 డిగ్రీల వరకు పలు మండలాల్లో ఇటీవల నమోదవుతుండగా, మంగళవారం 37 డిగ్రీలకే పరిమితమయ్యాయి. అత్యధికంగా తవణంపల్లెలో 37.2, నగరిలో 37, అత్యల్పంగా కుప్పంలో 31.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాలవారీగా శ్రీరంగరాజపురంలో 36.7డిగ్రీలు, పులిచెర్ల, వెదురుకుప్పం మండలాల్లో 36.5, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 36.4, పూతలపట్టులో 36.3, బంగారుపాళ్యంలో 35.6, సదుంలో 35.3, నిండ్రలో 35, చౌడేపల్లె, ఐరాల, యాదమరి,పాలసముద్రం, పెనుమూరు, విజయపురం మండలాల్లో 34.5,గంగవరం, రొంపిచెర్ల, వి.కోట మండలాల్లో 33.3, గుడుపల్లిలో 32.3, పలమనేరులో 32.3, శాంతిపురంలో 32.3, పుంగనూరులో 31.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కొండకు నిప్పు

రేణిగుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శేషాచలం కొండల చివరి భాగం వెంకటాపురం, కంకంబాడి కొండకు మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. కరకంబాడి కొండ వెనుక వైపునకు మంటలు వ్యాపించాయి. వెంకటాపురం కొండ అంటుకోవడంతో ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది.

మండుటెండలో అమ్మవారి భక్తుల ఇబ్బందులు


వకుళమాత ఆలయం వద్ద ఎండవేడిమికి తాళలేక ఇలా పరుగులు - ఎండలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులకు పైన రక్షణేదీ?

తిరుపతిరూరల్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పేరూరుబండపై వకుళమాత అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎండవేడికి అల్లాడుతున్నారు. ఆలయ పరిసరాల్లో నీడలేక అవస్థలు పడుతున్నారు. మెట్లదారి మీదుగా కొంతదూరం వరకు రేకులషీట్లను ఏర్పాటు చేసినా ఇబ్బందులు తప్పడం లేదు. వీటిని సరైన పద్ధతిలో ఏర్పాటు చేయలేదు. ఇటీవల బండ మీద కొంత కూలింగ్ పెయింట్ వేసినా ఎండ తీవ్రతకు సరిపడటంలేదని భక్తులు వాపోతున్నారు. స్లోప్‌గా ఉన్న బండపై నడిచి వెళ్లేందుకు వీరు ఇబ్బందిపడుతున్నారు. కొందరు కొండ ఎక్కలేక దండం పెట్టుకుని సగం దారి నుంచే వెనుదిరుగుతున్నారు. ఆలయ ప్రాంగణంలోనూ సరైన వసతులు లేవు. గోపురం ముందు కొంతభాగమే రేకులషీట్లను ఏర్పాటు చేశారు. నైవేద్య విరామ సమయంలో గోపురం ఎదుట క్యూలైన్‌లో ఎండలో నిలబడాల్సి వస్తోంది. దక్షిణవైపున గోపురం కనిపించేలా ట్రాన్స్‌పరెంట్(వైట్‌షీట్) రేకులషీట్లు వేసేందుకు ఇనుప దిమ్మెలను ఏర్పాటు చేసినా షీట్లు వేయకుండా వదిలేశారు. తూర్పువైపున కొంత దూరం ఎండ నుంచి ఉపశమనానికి పలుచటి వస్త్రాన్ని కట్టారు. మెట్లమార్గంలో దారిపొడవునా ఎండ, వానల నుంచి రక్షణగా శాశ్వత పనులు చేపట్టాలని, ప్రాంగణంలో మూడువైపులా రేకులుషీట్లు,చలువపందిరిళ్లు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. వేసవి నేపథ్యంలో కొండ కింద ఆర్చి వరకు చలువపందిళ్లు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లిలా.. తుప్పుపట్టి పోవాలా..!?

● నాలుగు నెలలుగా గ్యారేజీకే పరిమితమైన ఓల్వో బస్సులు


టూరిజం ట్రాన్స్‌పోర్ట్ గ్యారేజీలో ఓల్వో బస్సులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తిరుపతి డివిజన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి సంబంధించిన ఆరు ఓల్వో బస్సులు నాలుగు నెలలుగా గ్యారేజీకే పరిమితమయ్యాయి. టూరిజం ద్వారా శ్రీవారి దర్శన టిక్కెట్ల కోటా జారీలో జరిగిన అవకతవకల కారణంగా విమర్శలు వెల్లువెత్తడంతో టీటీడీ స్పందించింది. దీంతో గత డిసెంబరు మొదలు నుంచి దర్శనటిక్కెట్ల కోటాను బ్లాక్ చేసింది. అప్పటి నుంచి ఆరు ఓల్వో బస్సులు (తమిళనాడు, కర్ణాటక నుంచి పర్యాటకులను తరలించేవి)జూపార్కు మార్గంలో ఉన్న ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ట్రాన్స్‌పోర్ట్ గ్యారేజీ నుంచి రోడెక్కడం లేదు. మధ్యలో మహాకుంభమేళా మినహా మిగిలిన రోజులంతా అక్కడే పార్క్ చేసి ఉన్నాయి.

నెలల తరబడి ఖరీదైన వాహనాలు మూలన పడేయడం వల్ల నష్టపోతామని అధికారులు తమ వంతు బాధ్యతగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తమిళనాడు, కేరళకు ప్యాకేజీ టూర్లు నడపాలని ఇటీవల ప్రణాళికలు సిద్ధంచేశారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచినా పర్యాటకుల నుంచి ఆశించినస్థాయిలో ఆదరణ లేకపోవడంతో విరమించుకున్నారు. ఆ తర్వాత ఉచిత టోకెన్ల కోసం బెంగళూరు నుంచి తిరుపతికి ఒక ఓల్వో బస్సును పదిరోజుల క్రితం ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. అందులోనూ రోజూ డజను మంది మాత్రమే వచ్చివెళ్తున్నారు. ఇది కూడా నష్టంలోనే నడుస్తోంది.

ఇలాగే ఉంటే కండిషన్ కోల్పోతాయి

అటు ప్రభుత్వానికి, ఇటు టీటీడీకి పలుమార్లు సమస్యను విన్నవించినా ప్రయోజనం లేకపోతోందని అధికారులు విచారం వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా పార్కింగ్‌లోనే ఉన్న ఓల్వో బస్సుల కండిషన్ మరింత కోల్పోయే ప్రమాదముంది. కాగా గ్యారేజీలో పనిచేసే దాదాపు 60మంది సిబ్బందికి జీతాలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు.

ఆస్తి లాక్కొని తరిమేశాడు

కుమారుడిపై డీఎస్పీకి చదళ్ల వృద్ధుడి ఫిర్యాదు


డీఎస్పీకి ఫిర్యాదులు చేస్తున్న అడ్వకేట్ ప్రేమ్‌కుమార్ - అమరనాథ్ దంపతులు

పుంగనూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కన్నబిడ్డే వృద్ధాప్యంలో ఉన్న తనను మోసం చేసి ఆస్తి కాజేయడంతో పాటు పట్టించుకోకుండా వదిలేశాడని ఓ తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ప్రభాకర్ మండల ప్రజలనుంచి ఫిర్యాదులను తీసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చదళ్ల గ్రామానికి చెందిన 80యేళ్ల జి.కృష్ణప్ప తన సమస్యను వివరిస్తూ..... తనతో పాటు తన భార్య వెంకటమ్మ పేర్లతో ఉన్న 13 ఎకరాల పొలాన్ని రెండవ కుమారుడు దేవరాజు, అతడి భార్య రాధిక కలసి మోసం చేసి వీలునామా రాసుకుని అక్రమంగా కాజేశారన్నారు. భూమికి సంబంధించి రికార్డులు మార్చుకున్నారని, నమ్మించి రిజిస్టర్ చేసుకుని మోసం చేశారని, తన భార్య చనిపోయాక తన గురించి పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేశారు. గతంలో పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయంచేసి తన భూమి తనకు ఇప్పించాలని కృష్ణప్ప కోరారు. డీఎస్పీ ప్రభాకర్ ఆయనకు సమాధానమిస్తూ... సెక్షన్ 7 క్లాజ్ 31 అమెండ్‌మెంట్ యాక్టు ప్రకారం వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలపై చర్యలు తీసుకునేలా ఫిర్యాదు ఆధారంగా ఆర్డీవో భవానికి నివేదిక పంపుతున్నట్లు చెప్పారు. ఆస్తిని కృష్ణప్పకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నట్లు తెలిపారు.చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన అమరనాథ్ దంపతులు మాట్లాడుతూ 764/1, 764/3 సర్వే నంబర్లలో వున్న తమ పొలంలోకి రాజకీయ పలుకుబడిగల పుల్లా నాయుడు రానివ్వకుండా అడ్డుపడుతున్నారని వాపోయారు. సర్వే చేసి తమ భూమి హద్దులు గుర్తించి ఆక్రమణలు తొలగించాలని విన్నవించారు. డీఎస్పీ ఫోన్‌లో తహసీల్దార్ రాముతో మాట్లాడారు. తాను విజయవాడలో హైకోర్టు పనిపై వచ్చానని, పుంగనూరుకు రాగానే సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. పుంగనూరుకు చెందిన అడ్వకేట్ పూల ప్రేమ్‌కుమార్ డీఎస్పీని కలిసి గత ఏడాది మార్చి 14వ తేదీన తనపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైసీపీ నాయకులు దాడి చేశారన్నారు. 158/2024 మేరకు కేసు నమోదు చేసినా పోలీసులు చార్జ్‌షీట్ వేయలేదని తెలిపారు. న్యాయవాదులపై దాడులు జరిగినా నాటి పోలీసులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి తనపై తప్పుడు కేసులు పెట్టారని, కేసు రాజీ పోవాలని వైసీపీ నేతలు భయపెడుతున్నారని వివరించారు.డీఎస్పీ ప్రభాకర్ విచారించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో ప్రతి మంగళవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తామని చెప్పారు. తొలి గ్రీవెన్స్‌డేలో 8 ఫిర్యాదులు రాగా పోలీస్ శాఖ సమస్యలను విచారిస్తున్నామని, ఇతర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి పంపామన్నారు. ఈ సమస్యలపై వచ్చే మంగళవారం నాటికి చర్యలుంటాయని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు, గొడవలు, విభేదాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

రంగంపేట పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్వర్ణనారావారిపల్లె అభివృద్ధిలో భాగంగా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ మోడల్ స్కూల్‌కు సంబంధించిన పనులను వచ్చే విద్యా సంవత్సరం లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల పురోగతి పనులపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో హైలెవల్ స్ట్రక్చర్‌తో అన్నిహంగులతో కూడిన వంటగది, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లు, తాగునీరు, కంప్యూటర్ ల్యాబ్, ఐఎఫ్‌పీ ప్యానల్స్, అడ్వాన్స్ స్మార్ట్ క్లాస్ రూమ్స్, స్పోర్ట్స్ కిట్స్, క్రీడా మైదానం తదితర మౌలిక వసతులను అత్యాధునిక పద్ధతిలో నాణ్యతతో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఆర్డీవో రామ్మోహన్, డీఈవో కేవీఎన్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, శ్రీసిటీ ప్రతినిధులు, జిల్లా పరిశ్రమల అధికారి సుధాకర్‌రావు, లోకనాథం, డీఆర్‌డీఏ పీడీ శోభన బాబు, తహసీల్దారు శివరాం పాల్గొన్నారు.

భక్తాగ్రేసుడిపై పట్టాభిరాముడు


హనుమంత వాహనంపై- గజ వాహనంపై శ్రీరాముడు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం తన భక్తాగ్రేసరుడైన హనుమంతుడిపై శ్రీరాముడు కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు సీతా లక్ష్మణ సమేత రామచంద్ర మూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఉత్సవమూర్తులకు వసంతోత్సవం, ఆస్థానం జరిగింది. వాహన సేవల్లో ఊరేగి అలసిన స్వామి, అమ్మవార్లకు ఉపశమనం కల్పించడానికి వసంతోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. రాత్రి 7 గంటలకు గజ వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు.

గజ దాడులతో వణుకుతున్న రైతులు

క్షేత్రస్థాయి పరిశీలనకు రాని జిల్లా అటవీ అధికారి?


మార్లబండ సమీపంలో ఏనుగు హల్‌చల్

యాదమరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): యాదమరి సరిహద్దులోని దళవాయిపల్లె అటవీ ప్రాంతంలో తిష్ట వేసిన 25 గజరాజుల గుంపు పంట పొలాలపై దాడులు చేస్తున్నాయి. దీంతో అటవీ సమీపంలోని పది గ్రామాల రైతులు కంటి మీద కునుకు లేకుండా వణికిపోతున్నారు. దళవాయిపల్లె బట్టు కామాక్షిపురం వద్ద సోమవారం రాత్రి 14 ఏనుగుల గుంపు, ఒక ఒంటరి ఏనుగు, మార్లబండ, పెరుమాళ్లపెంట, కాశిరాళ్ల వద్ద మూడు ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. కాశిరాళ్ల గ్రామానికి చెందిన రాజారత్నంకు చెందిన ఎకరం, ధనుష్‌కోటికి ఎకరం వరి పంటలను మూడు ఏనుగుల గుంపు తొక్కి ధ్వంసం చేశాయి. మార్లబండకు చెందిన శివాజీ, భరత్ ఇంటి సమీపంలో వరి, అరటి, మామిడి, రాగి పంటలను నాశనం చేశాయి. కుప్పం నుంచి అదనంగా మరో ఏడుగురు అదనపు ట్రాకర్లను మండలానికి రప్పించారు. వీరి సాయంతో బాణసంచా కాల్చి గజరాజులను అడవిలోకి మళ్లించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను ఎఫ్‌ఎస్‌వో మోహనమురళి, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది పరిశీలించారు.

మా బాధలు పట్టవా?: రైతులు

యాదమరి మండల పరిధిలోనే మూడు నెలలుగా గజరాజులు తిష్ట వేసుకుని ఉన్నాయి. రైతులు వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి వచ్చి శాశ్వత పరిష్కారం చూపాలని అటవీ అధికారికి విన్నవించారు. అయితే అధికారి సమీక్షలకే పరిమితమై.. క్షేత్రస్థాయి పరిశీలనకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. కార్యాలయానికే పరిమితమై తమ బాధలు పట్టించుకోకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

రూ.10లక్షలతో కందకాలు తవ్వడానికి కలెక్టర్ హామీ: ఎమ్మెల్యే


ధ్వంసమైన పంటను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

గజరాజుల వరుస దాడుల నేపథ్యంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫోన్‌చేసి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. కందకాలు తవ్వడానికి రూ.10లక్షల విడుదలకు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. త్వరలోనే అటవీ సమీపంలోని 10 గ్రామాల పరిధిలో కందకాలు తవ్వే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళంను అందిస్తున్న దాతలు

తిరుపతి(కల్చరల్),ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి మంగళవారం రూ. ఒక లక్ష విరాళంగా అందింది. తిరుపతికి చెందిన జ్యోతి, వి.కృష్ణకాంత్ ఆలయ నిర్మాణానికి విరాళం అందించారు. విరాళంను ఆలయ ఈవో ఎ.జయకుమార్‌కు అందజేశారు.

ఘంటసాల చిరస్మరణీయులు



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తన గానమృతంతో తెలుగు ప్రజలు హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వర రావు అని రాయలసీమ రంగస్థల చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి అన్నారు. ప్రతినెలా 1వ తేదీ చేసిన విధంగానే తిరుపతిలోని ఘంటసాల విగ్రహానికి మంగళవారం నివాళులు అర్పించారు. ఈ కార్య క్రమంలో జనార్ధరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, ముని, డాక్టర్ అర్జున్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు జగన్ అడ్డుపడుతున్నారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు జగన్ అడ్డుపడుతున్నారని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు నరేంద్ర విమర్శిం చారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపిందన్నారు. అయితే శాసనమండలిలో తీర్మానానికి వైసీపీ అడ్డుపడు తోందన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం వర్గీకరణకు ఆర్డినెన్స్ తీసుకు రానుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, గోపి, మధు, చిన్న గోపి, వాసుదేవరావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పండ్ల రసాలు ఎక్కువగా తాగాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ బాలకృష్ణనాయక్, ఆర్టీసీ అధికారులు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు వడదెబ్బకు గురికాకుండా పండ్ల రసాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలు ఎక్కు వగా తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ సూచించారు. మంగళవారం సెంట్రల్ బస్సుస్టేషన్ ఆవరణంలో ప్రయాణికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయటకు వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ, తలపాగా ధరించాలని సూచించారు. నీరసం, కళ్లు తిరగడం, తలనొప్పి, వాంతులు వంటి వడదెబ్బ లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో నరసింహులు, ఏటీఎం రామచంద్రనాయుడు, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పద్మావతి, డాక్టర్ దీప్తిలావణ్య, కిరణ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెన్షన్ల పంపిణీ

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం ఉదయం స్థానిక పల్లెవీధి, ఎల్లపురెడ్డికాలనీల్లో పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 18,714మంది లబ్ధిదారులకు రూ. 8,21,47,000కోట్లు అందించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, కార్పొరేటర్లు, నరసింహాచారి, ఎస్‌కే బాబు, నరేంద్ర, బుల్లెట్ రమణ, ఇనుకొండ సుబ్రహ్మణ్యం, వరప్రసాద్, అనిత తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులతో చర్చలు విఫలం



సదరన్ డిస్కం హెచ్‌ఆర్‌డితో చర్చలు జరుగుతున్న కాంట్రాక్టు కార్మికులు

తిరుపతి(ఆటోనగర్) ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల చర్చలు విఫలమయ్యాయి. సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట 9 రోజులుగా కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న ఆందోళనకు స్పందించిన సంస్థ హెచ్‌ఆర్‌డీ రమణాదేవి నాయకులను చర్చలకు ఆహ్వానించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు లేవని నాయకులు శివప్రసాద్‌రెడ్డి ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని విన్నవించారు. ప్రధానంగా జీతాలు పెంచాలని కోరారు. అయితే అవి తమ పరిధిలో లేవని ఆమె బదులిచ్చారు. దీంతో తమ దీక్షలను యథావిధిగా కొనసాగిస్తామని నాయకులు స్పష్టంచేశారు. ఈ చర్చల్లో నాయకులు కుమార్, సుదర్శన్, నాగార్జునరెడ్డి, మునికృష్ణ, కిషోర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రొవిజన్ షాపులో చోరీ



చోరీకి గురైన దుకాణం

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని ప్రొవిజన్ షాపులో సోమవారం అర్ధ రాత్రి దొంగలు పడ్డారు. దుకాణంలో ఉన్న దాదాపు రూ.11 వేలు నగదు, బియ్యం, కందిపప్పు, ఆయిల్ వంటి రూ.30 వేల విలువైన సరుకులు చోరీచేశారు. ఎస్‌ఐ రామకృష్ణ కథనం మేరకు.. తిరుపతి రూరల్ చెర్లోపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద చంద్ర క్లాసిక్ ప్రొవిజన్ స్టోర్ ఉంది. యజమాని చంద్రబాబు వ్యాపారం ముగించుకుని సోమవారం రాత్రి ఇంటికి వెళ్లాడు. అర్ధ రాత్రి తర్వాత దుండగులు దుకాణం షట్టర్ పగుల కొట్టి రూ.11వేల నగదు, పలు సరుకులు దోచుకెళ్లారు. యజమానికి మంగళవారం ఉదయం యథావిధిగా దుకాణం వద్దకు వచ్చాడు. షట్టర్ పగిలిపోయి ఉండడం గమనించాడు. లోనికెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని గుర్తించి వెంటనే తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుల సుందరీకరణ పనులు వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో ఉన్న చెరువుల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాల యంలో చెరువుల సుందరీకరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సరదాగా గడిపేందుకు వస్తారని ఈ నేపథ్యంలో వారికి ఆహ్లాదం పంచేలా చెరువుల వద్ద అవసరమైన వసతులు కల్పించాలన్నారు. అలాగే సప్లై చానల్స్ పునరుద్ధరించాలని సూచించారు.జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, ఆర్డీవోలు రామ్మోహన్, భాను ప్రకాష్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, ఎస్‌ఈ శారద, మత్స్యశాఖ అధికారి నాగరాజు, ఏడీ సర్వేయర్ అరుణకుమార్, కార్పొరేషన్ ఎస్‌ఈ శ్యాంసుందర్, తుడా ఎస్‌ఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.









ఎండలు .. రుయాలో రోగుల అవస్థలు

తిరుపతి(వైద్యం)ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ ఎండలు మండిపోతున్నాయి. సాధారణ ప్రజలే ఎండలకు భయపడిపోతున్నారు. అలాంటిది రోగుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. సుదూర ప్రాంతాల నుంచి రుయాస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగుల, వారి సహాయకులు ఎండతాకిడిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్య పరీక్షలకు తీసుకువెళ్లే చిన్నపిల్లల, వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న రోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అసలే ఆస్పత్రిలో ఓపీ ఒక చోట, వైద్య పరీక్షలు మరో చోట, వార్డులు వేరే చోట ఉంటాయి. ఈ నేపథ్యంలో రోగులను, చిన్నారులను అటూ ఇటూ తీసుకువెళ్లేందుకు మండుతున్న ఎండలో తిప్పలు తప్పడం లేదు. కనీసం దాహార్తి తీర్చుకోవాలన్నా ఆస్పత్రిలో చుక్క నీరు లేదు. రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు.

బినామీలతో మార్కెట్‌ను దోచేశారు

మౌలిక వసతులు మెరుగు పరుస్తాం ● కూరగాయల మార్కెట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ఆరణి



మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే ఆరణి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కాంట్రాక్టర్ యువరాజ్‌రెడ్డి తదితరులు

తిరుపతి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ కూరగాయల మార్కెట్‌ను గత వైసీపీ పాలకులు బినామీలతో దోచేసి కార్పొరేషన్ ఆదాయానికి గండికొట్టారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. కూటమి నేతలతో కలసి ఎమ్మెల్యే మంగళవారం మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ గేట్‌ను ప్రారంభించారు. మార్కెట్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తామని. వినియోగదారులు పరిశుభ్ర వాతవరణంలో సరుకులు, కూరగాయలు కొనుగోళ్లు చేసేలా చూడాలని వ్యాపారులను ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మార్కెట్ టెండర్లను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. "ఒకటోసారి...రెండోసారి...మూడోసారి..." శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంలోని అంశాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కాంట్రాక్టర్ అన్నారెడ్డి యువరాజ్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్కే. బాబు, అన్నా అనితా యాదవ్, నాయకులు పులుగోరు మురళి, రాజారెడ్డి, మహేష్ యాదవ్, దొరైరాజ్, మునిచంద్ర, కేఎంకే లోకేష్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు వైద్య కళాశాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ బదిలీ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలోని ఫార్మకాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సీ.ఎస్.రమ్యను కర్నూలు వైద్య కళాశాలకు బదిలీ చేస్తూ డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) నరసింహం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ రమ్య ఆరోగ్య కారణాల రీత్యా కర్నూలుకు బదిలీ కోరుతూ ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఈ క్రమంలో ఆమెను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన



పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య, డీసీ అమరయ్యలు

తిరుపతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం పంపిణీ చేసిన ఎన్టీఆర్ పింఛన్ భరోసా కార్యక్రమాన్ని కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. ఆమెతో పాటు సహాయ కమిషనర్ అమరయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా మున్సిపల్ కార్పొరేషన్ ఆవిర్భావ వేడుకలు



కార్మికులతో కేక్ కట్ చేయిస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు

తిరుపతి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 139వ ఆవిర్భావ వేడుకలు మంగళవారం కార్పొరేషన్ కార్యాలయ ఆవరణంలో ఘనంగా జరిగాయి. స్థానిక రిజర్వేషన్ల పోరాట సమితి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల చేత కేక్ కట్ చేయించారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్కే. బాబు, నరసింహాచారి మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి అధికారికంగా మున్సిపల్ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. ఆమేరకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయనున్నట్టు చెప్పారు. రిజర్వేషన్ల పోరాట సమితి వ్యవస్థాపకుడు డీఎంసీ భాస్కర్, టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్ మునిరామయ్య, ఈతమాకుల హేమంత్ కుమార్, చోడ మధు, జీఎంకే నారాయణ, యువరాజు, వేణు, మురళి, కొంకావీధి ముని, బసవ, దొరై తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్కూల్స్ ఏర్పాటులో నూతన మార్గదర్శకాలు పాటించాలి



డ్రైవింగ్‌స్కూల్ యాజమాన్యంతో సమావేశమైన డీటీవో మురళీమోహన్

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్ సూచించారు. మంగళవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డ్రైవింగ్ స్కూల్స్ యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఒక డ్రైవింగ్ స్కూల్ శిక్షణ సంస్థను నెలకొల్పవచ్చని అన్నారు. ఈ శిక్షణ సంస్థను తిరుపతి పరిధిలో కానీ గ్రామీణ ప్రాంతంలో కానీ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఇందు కోసం రెండు ఎకరాల స్థలం సొంతంగా కానీ, లీజుకు కానీ ఉండాలని తెలియజేశారు. 2026 మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. వివరాల కోసం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఏవో విజయ ప్రశాంతి, సీనియర్ అసిస్టెంట్ యువ కిషోర్ పాల్గొన్నారు.



భారీగా పెరుగుతున్న పుట్ట

వామ్మో.. ఎంతపెద్ద పుట్ట..!

ఆ పుట్ట ఎత్తు దాదాపు 10 అడుగులు.. చుట్టుకొలత దాదాపు 30అడుగులు. నగర శివారు ప్రాంతమైన మంగళంలోని తిరుమలనగర్ గ్రామ సచివాలయ పరిధి కరకంబాడి మార్గం నుంచి హరితకాలనీకి వెళ్లే మలుపులో రోడ్డుపక్కనే ఈ భారీ పుట్ట ఉంది. ఆ కాలనీవాసులు పుట్టాలమ్మగా కొలుస్తూ పూజలు చేసుకుంటున్నారు. పుట్ట వర్షాలకు కరిగిపోకుండా పైన రేకులు సైతం ఏర్పాటు చేశారు. రోడ్డున వెళ్లేవారు ఈ పుట్టను చూసి వామ్మో ఎంత పెద్ద పుట్ట అని ఆశ్చర్యపోతున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

పూర్తికావస్తున్న కేబీఆర్‌నగర్ వంతెన



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మంగళంలోని తిరుమలనగర్ గ్రామపంచాయతీ పరిధి కేబీఆర్ నగర్‌కు వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న వంతెన దాదాపుగా పూర్తి కావస్తోంది. గతంలో ఉన్న తాత్కాలిక కల్వర్టు వర్షాలకు కొట్టుకుపోయేది. దాంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడేవారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వ కొలువుదీరిన తరువాత కూడా వర్షాలకు తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. ఆ సమయంలో ప్రస్తుతానికి దారి కల్పిస్తామని వచ్చిన యంత్రాగాన్ని ప్రజలు అడ్డుకున్నారు. తమకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టుబట్టారు. దీంతో దాదాపు రూ.20లక్షల వ్యయంతో గత జనవరిలో శాశ్వత వంతెన నిర్మాణం ప్రారంభించారు. ఆ పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. మిగిలిన కొద్దిపాటి పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దీనిపై కేబీఆర్‌నగర్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు 'తల్లిపాల నిధి' మొదటి వార్షికోత్సవం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోటరీ క్లబ్ సహకారంతో గత ఏడాది ఏర్పాటు చేసిన తల్లిపాల నిధి కేంద్రం మొదటి వార్షికోత్సవం ఈ నెల 3వ తేదీన ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు రోటరీ మిల్క్ బ్యాంక్ ప్రాజెక్టు చైర్మన్ దామోదరం తెలి పారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ వార్షికోత్సవానికి కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్ సహా పలువురు హాజరవుతార న్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, హేమచంద్ర, రాజేష్‌కుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.

రుయాలో ఐదేళ్ల బాలికకు అరుదైన శస్త్ర చికిత్స



కోలుకున్న బాలికతో వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోనే ఇప్పటి వరకు ఏ ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయని అరుదైన శస్త్ర చికిత్సను రుయాస్పత్రిలో విజయవంతంగా నిర్వహించి ఐదేళ్ల బాలిక ఆరోగ్యాన్ని బాగు చేశామని సూపరింటెండెంట్ రవిప్రభు తెలి పారు. రుయాస్పత్రిలో ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లో.. అన్నమయ్య జిల్లా టి.సుడుపల్లి మండలం ఆరోగ్యపురానికి చెందిన గణేష్‌నాయక్ కుమార్తె అక్షర(5) పుట్టుకతోనే మూత్ర సమస్యతో బాధపడుతుంది. బాలికకు నిత్యం మూత్రం పోతూ ఉండేది. ఐదేళ్లుగా రాయలసీమలోని పలు ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు కార్పొరేట్ ఆస్పత్రులకు తీసుకువెళ్లినా బాలిక సమస్యకు పరిష్కారం లభించలేదు. ఈ క్రమంలో బాలికను తల్లిదండ్రులు రుయాస్పత్రికి తీసుకువచ్చారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జగదీష్ పరీక్షించి బాలిక రెండు మూత్ర పిండాలకు రెండు మూత్రనాళాలతోపాటు అదనంగా మరో రెండు మూత్ర నాళాలు ఉండడంతో నిరంతరం మూత్రం పోతోందని గుర్తించారు. వెంటనే చిన్నపిల్లల విభాగాధిపతి మనోహర్, అనస్తీషియా విభాగాధిపతి రాధ దృష్టికి తీసుకువెళ్లి వారి సాయంతో అతిక్లిష్టమైన శస్త్రచికిత్స చేసి అదనపు మూత్రనాళాలను సరిచేశారు. ప్రస్తుతం బాలిక పూర్తిగా కోలుకుంది. మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. తమ బిడ్డకు అతిక్లిష్టమైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టిన వైద్య బృందానికి బాలిక తల్లి దండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మధుసూదన్, హరికృష్ణ, ఎస్.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



మొదటి ఘాట్‌లో అదుపు తప్పిన వాహనం

● ఐదుగురికి గాయాలు

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌లో మంగళవారం టీటీడీకి చెందిన టెంపో వాహనం అదుపుతప్పి పిట్టగోడను ఢీకొంది. దీంతో ఐదుగురికి గాయాలయ్యాయి. తిరుమలలో అనధికారికంగా ఉంటున్న వ్యక్తులను వారం రోజులుగా విజిలెన్స్ పోలీసులు గుర్తించి తిరుపతికి తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే మంగళవారం కూడా 22 మందిని గుర్తించారు. వీరిని బైండోవర్ చేసేందుకు టెంపో వాహనంలో తిరుమల నుంచి తిరుపతికి తరలించారు. ఈ క్రమంలో మొదటి ఘాట్‌లోని చివరి మలుపు వద్ద వాహనం అదుపుతప్పి పిట్టగోడను ఢీకొంది. ఈప్రమాదంలో ఐదుగురు భక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రుయా ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. వాహనంలో 14 మంది మాత్రమే ఉన్నారని, మిగిలిన వారు ఆర్టీసీ బస్సులో వెళ్లాలని పోలీసులు చెబుతున్నా నిబంధనలకు విరుద్ధంగా 22 మందిని ఎక్కించినట్టు తెలుస్తోంది.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.04 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,007

తలనీలాలు సమర్పించినవారు: 27,440



ఇంటర్‌లో సంస్కరణలకు నాంది

విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ ఓ కీలకమలుపు. మ్యాథమేటిక్స్ కోర్సులవైపు వెళ్లాలా... లేక సైన్స్ కోర్సుల్లో చేరాలా అనే విషయాన్ని నిర్ధారించుకునే తరుణమిదే. ఈ దశలో ఎంపిక చేసుకున్న గ్రూప్ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఆసక్తి ఉన్న అంశాన్నే ఎంపిక చేసుకోవాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. మ్యాథ్స్ కోర్సులకు ఎంపీసీ, సైన్స్ కోర్సులకు బైపీసీ తీసుకుంటారు. ఈ రెండూ చదవాలనుకుంటే ఇప్పటివరకూ కుదరని పరిస్థితి. కానీ తాజాగా రెండు గ్రూపులూ చదివేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అంతేకాదు ముఖ్యమైన ఇంటర్మీడియట్ విషయంలో కొన్ని మేలైన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



కొత్తగా ఎంబైపీసీ

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపు అందుబాటులోకి రానుంది. ఆరు సబ్జెక్టులతో ఎంబైపీసీ చదవచ్చు. లాంగ్వేజి సబ్జెక్ట్ ఇంగ్లిష్ తప్పనిసరి. తరువాత సెకండ్ లాంగ్వేజీ ఆప్షనల్‌గా ఎంచుకోవచ్చు. ఇవికాకుండా గణితం, బయాలజీ, ఫిజిక్స్ కెమెస్ట్రీ సబ్జెక్టులు ఈ గ్రూప్‌లో ఉంటాయి. ఎంపీసీ విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్‌గా హిందీ, సంస్కృతం, ఉర్దూ కాకుండా బయాలజీ తీసుకుని ఎంబైపీసీ చదవవచ్చు. బైపీసీ విద్యార్థులు గణితాన్ని తీసుకుని ఎంబైపీసీ గ్రూపు చదవవచ్చు. ఎంబైపీసీ తీసుకున్న విద్యార్థులకు అవకాశాలు విస్తృతమవుతాయి. వీరు ఇటు మెడిసిన్, అటు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ఎంబైపీసీ గ్రూపునకు మంచి స్పందన లభించనుంది.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు: 21

ప్రయివేట్ జూనియర్ కాలేజీలు: 132

ఇతర యాజమాన్య కళాశాలలు: 7

ప్రథమ సంవత్సర విద్యార్థులు: 32,689

ఈఏడాది నుంచి కొత్తగా ఎంబైపీసీ గ్రూప్

మెడిసిన్, ఇంజనీరింగ్‌ల్లో చేరికకు అవకాశం

గణితం, బోటనీ, జువాలజీ కలిపి బయాలజీ

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు శ్రీకారం

ఇప్పటివరకూ ఇంటర్మీడియట్‌లో ఆరు సబ్జెక్టుల విధానం ఉంది. సైన్స్ గ్రూపుల్లో రెండు భాషా సబ్జెక్టులు, నాలుగు కోర్ సబ్జెక్టులు, ఆర్ట్స్‌లో రెండు భాష, మూడు కోర్ సబ్జెక్టులు ఉన్నాయి. ఇకపై ఐదు సబ్జెక్టుల విధానం అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఎంపీసీలో గణితం ఏ, బీ పేపర్లుగా ఉంది. దీనిని ఒకే సబ్జెక్ట్‌గా మార్చింది. బైపీసీలో బోటనీ, జువాలజీ సబ్జెక్టులను కలిపి బయాలజీగా చేసింది. దీనివల్ల సైన్స్ గ్రూపుల్లో కోర్ సబ్జెక్టులు ఐదు నుంచి నాలుగుకు తగ్గాయి. ఎంపీసీలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ తప్పనిసరిగా ఉంటాయి. మరో సబ్జెక్ట్‌గా తెలుగు, సంస్కృతాన్ని ఐచ్ఛికంగా తీసుకోవచ్చు. బైపీసీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్‌తోపాటు ఒక ఎంపిక సబ్జెక్ట్ ఉంటుంది. ఆర్ట్స్ గ్రూప్‌లో కూడా గణితం, బయాలజీలను ఆప్షనల్‌గా తీసుకోవచ్చు. 6వ సబ్జెక్టును ఆప్షనల్‌గా ఎంచుకునే అవకాశం లేదు. రెండో స్థానంలోని లాంగ్వేజ్ సబ్జెక్టును మాత్రమే ఎంచుకునే అవకాశం ఉంటుంది.

ఎన్‌సీఈఆర్టీ సిలబస్

ఇంటర్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశ పెట్టనున్నారు. ఈ ఏడాది పదవ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్ బోధించినందున ఇంటర్ మొదటి సంవత్సరంలోనూ ఈ సిలబస్‌ను ప్రారంభించనున్నారు. రెండో సంవత్సర విద్యార్థులకు పాత విధానమే కొనసాగనుంది. పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాలు, తరగతుల నిర్వహణ విధానాలను సీబీఎస్ఈ విధానంలోకి మార్చారు. ఆమేరకు ఏప్రిల్ 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. 7వ తేదీ వరకు కొత్త సిలబస్‌పై ఓరియంటేషన్ తరగతులు జరుగనున్నాయి. 7 నుంచి ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. 24 నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులిస్తారు. జూన్ 2వ తేదీన కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సీబీఎస్ఈ సిలబస్ పుస్తకాలతోపాటు నోట్‌పుస్తకాలు, రికార్డు షీట్లను ప్రభుత్వమే ఉచితంగా విద్యార్థులకు అందించనుంది.



ఎర్రచందనం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

● రూ.మూడు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.మూడు లక్షలు జరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ లైజన్ అధికారి చంద్రశేఖర రాజు తెలిపిన ప్రకారం.. చిత్తూరుకు చెందిన సత్యమోహన్, మరికొందరు కలిసి కొన్నేళ్లుగా శేషాచలం అడవుల్లో నుంచి ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారు. 2019లో రాయచోటి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని సరస్వతి పల్లి బీట్‌లో 39 కిలోల ఎర్రచందనం దుంగలు తమిళనాడుకు తరలించడానికి సిద్ధం చేశారు. ఈ విషయం తెలిసి అప్పటి అటవీశాఖ బీట్ అధికారి భరణికుమార్, సెక్షన్ అధికారి శ్రీరాములు అక్కడికి వెళ్లి వాహనం సహా దుంగలు పట్టుకున్నారు. నిందితుల్లో ఒకడైన సత్యమోహన్‌ను అరెస్టు చేయడానికి సిద్ధపడగా, అధికారుల ఎదుటే అతడు బ్లేడుతో ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో ఎర్రచందనం అక్రమ రవాణాతో పాటు ఆత్మహత్యాయత్నంపైనా కేసు నమోదు చేశారు. ఈ కేసును తిరుపతి ఎర్రచందనం కోర్టులో దాఖలు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమ నాయుడు ప్రభుత్వం తరపున వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా అటవీ శాఖ బీట్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, లైజన్ అధికారి చంద్రశేఖర రాజు,కోర్టు కానిస్టేబుల్ కొండయ్య తగిన సాక్ష్యాధారాలను తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితుడు సత్యమోహన్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ మూడు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నరసంహమూర్తి తీర్పు చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే ఎవరినీ వదిలిపెట్టేది లేదని, శిక్షలు కఠినంగా ఉంటాయని బీట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరలో డ్రోన్లతోనూ నిఘా పెడతామన్నారు.





గ్రామస్థులు విచారిస్తున్న పోలీసులు, గాయపడ్డ భూపతిరెడ్డి

కత్తులతో దాడి: ఒకరికి తీవ్రగాయాలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కత్తులతో దాడి చేసిన ఘటనలో ఒకరు గాయపడిన సంఘటన రామచంద్రాపురం మండలం అనుపల్లి పంచాయతీ రేకలచేనులో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వినాయకస్వామి ఆలయం వద్ద గత శనివారం రాత్రి 11 గంటల వరకు కొందరు భజన చేశారు. గ్రామానికి చెందిన లీలాప్రకాష్‌రెడ్డి వచ్చి తన నాలుగు నెలల పాప నిద్రపోవడం లేదంటూ మైక్ ఆపాలని కోరారు. దీంతో కొంతసేపు ఆపి మళ్లీ మైక్ సౌండ్ బిగ్గరగా పెట్టి భజన చేశారు. దీంతో భజన చేసేవారితో లీలాప్రకాష్‌రెడ్డి వాగ్వాదానికి దిగారు. మైక్ తీసుకెళ్లారు. ఈ ఘటనను భూపతిరెడ్డి వీడియో తీసి తన మిత్రుడు రాజశేఖర్‌రెడ్డికి పంపారు. లీలాప్రకాష్‌రెడ్డి హిందువులను భజన చేసుకోనీయడం లేదంటూ రాజశేఖర్‌రెడ్డి ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో వారిద్దరిపై ఆదివారం లీలాప్రకాష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● రేకలచేనులో పోలీసు పికెట్

ఈ నేపథ్యంలో భూపతిరెడ్డి సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కడుపు, గొంతుపై కత్తితో దాడి చేశారు. గాయపడిన భూపతిరెడ్డి గట్టిగా కేకలు వేయడంతో వారు వెళ్లిపోయారు. గ్రామస్థులు భూపతిరెడ్డిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ట్రైనీ ఐపీఎస్ హేమంత్, డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎస్ఐ రవీంద్రనాథ్ మంగళవారం ఉదయం రేకలచేను చేరుకుని గ్రామస్థులను విచారించారు. ఇదే గ్రామంలో 30 ఏళ్ల వ్యవధిలో రాజకీయ ప్రతీకార హత్యలు జరిగాయి. వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, నాగిరెడ్డి అనే వ్యక్తులు హత్యకు గురయ్యారు. ప్రస్తుతం గాయపడిన భూపతిరెడ్డి నాగిరెడ్డి కుమారుడు. ఈ క్రమంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

తిరుమలలో తమిళనాడువాసి మృతి

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఓ యువకుడు మంగళవారం తిరుమలలో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. శ్రీవారి ఆలయం ముందున్న సహస్రదీపాలంకరణ మండపానికి సమీపంలో యువకుడు అచేతనంగా పడిఉంటాన్ని భక్తులు, సిబ్బంది గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వైద్య సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు ప్రకారం తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన మోహనసుందర్(35)గా తేలింది. చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందినట్టు ప్రిస్క్రిప్షన్లు ఉండటంతో అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కొద్దిరోజులుగా తిరుమలలోనే ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని అశ్విని ఆస్పత్రికి తరలించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

మోహనసుందర్ మృతదేహం



మద్యం తాగి డ్రైవింగ్ చేసినందుకు సేవా శిక్ష

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటకు చెందిన పవన్‌కుమార్ ఆదివారం రాత్రి మద్యం తాగి, పెద్ద శబ్దాలు చేసుకుంటూ బైక్ నడుపుతుండడంతో ఎస్ఐ సుబ్బారావు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.500 జరిమానా విధించారు. అలాగే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సేవ చేయాలని తీర్పు ఇచ్చారు. ఆస్పత్రిలో సేవ చేయకుండా తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లయితే రిమాండ్ విధిస్తామని చెప్పారు. అనంతరం నిందితుడిని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

ముక్కంటి భక్తులకు మజ్జిగ పంపిణీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని క్యూలలో వేచి ఉండే భక్తులకు మజ్జిగ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 8 ఏళ్ల కిందట అప్పటి ఈవో భ్రమరాంబ భక్తుల వేసవి తాపం తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. అప్పట్లో స్వల్పసంఖ్యలో భక్తులకు మాత్రమే అమలు చేశారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. కొవిడ్ నుంచి మజ్జిగ పంపిణీ అటకెక్కింది. 2022 ఏప్రిల్ 17న వేసవి తాపంతో క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులు ఆర్తనాదాలు పెట్టడం అప్పట్లో దుమారం రేగింది. అప్పటి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ముక్కంటి ఆలయానికి వస్తున్నారన్న కారణంతో మండు వేసవిలో ఏప్రిల్ 17న క్యూలైన్లను కొంత సమయం స్తంభింపచేశారు. సరిగ్గా మంత్రి మహద్వారం వద్దకు చేరుకోగానే డౌన్‌డౌన్ అంటూ భక్తుల నుంచి ఆలయంలో నిరసన నినాదాలు మిన్నంటాయి. ఈ ఘటన తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఆ తర్వాత వేసవిలో క్యూలైన్లలో అవసరమైన నీటి సరఫరాపై దృష్టి పెట్టారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం సూచనలతో దేవదాయశాఖ అధికారులు ఆలయంలో భక్తులందరికి మజ్జిగ పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆలయంలో మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సతీష్‌మాలిక్, సూపరింటెండెంట్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ అధికారులు



రేపటి మన సమాజ భవిష్యత్తు అయిన చిన్నారుల్లో పుస్తకాభిలాష తగ్గుతూ ఉంది. పిల్లల్లో పుస్తక పఠనాసక్తి పెంచితే సామాజిక బాధ్యత, నైతిక విలువలు అలవడతాయంటున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఉపాధ్యాయులు, సాహిత్యవేత్తలు. నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా కథనం.

పుస్తకం చదివితే ప్రపంచ విజ్ఞానం

● నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోను, కంప్యూటర్ ద్వారా నిత్యం యూట్యూబ్, వాట్సప్, ఫేస్‌బుక్‌లో గడిపే ఈ తరానికి పుస్తక పఠనాసక్తి తగ్గింది. దీనివల్ల చిన్నారులకు నిజమైన ప్రాపంచిక జ్ఞానం అందడం లేదు. దీంతో సామాజిక బాధ్యత, నైతిక విలువలు పెంపొందడం లేదు. ఒకనాడు ఊరిలో, ఇంట్లో పుస్తకాలు, కళల ద్వారా విజ్ఞానం అందేది. గుడిలో భజన, కోలాటం, చెక్క భజన, మహాభారతం వంటి కళా రూపాల ద్వారా ఎన్నో విలువలు అందేవి. పత్రికల ద్వారా.. బొమ్మల ద్వారా.. చిన్నారులకు విలువలు తెలియచేసే అవకాశం ఉండేది. ఇక, వేమన పద్యాలు, సుమతీ శతకం, బేతాళ కథలు వంటి పుస్తకాలు గొప్ప విజ్ఞానాన్ని అందించేవి. క్రమేణా చిన్నారుల్లో పుస్తకాల పట్ల అభిలాష తగ్గుతూ ఉంది. ఇందువల్ల చిన్నారుల్లో ఆత్మనూన్యత, మానసికంగా కుంగిపోవడం, అభద్రతా భావం, మానసిక వ్యధ పెరుగుతోంది. ఇటువంటి భావ దారిద్ర్యానికి మూల కారణం పుస్తక పఠనం లేకపోవడమేనని వ్యక్తిత్వ వికాస నిపుణులు, సాహిత్యవేత్తలు అంటున్నారు. చిన్నారుల్లో పుస్తక పఠనం పట్ల అభిలాష పెంచాలని కోరుతున్నారు. తద్వారా నైతిక విలువలు, సామాజిక బాధ్యత అలవడతాయని అంటున్నారు. ఈ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచిస్తున్నారు.

పుస్తకాలు చదవడంతోనే వ్యక్తిత్వ వికాసం



మంచి పౌరులుగా పిల్లలు ఎదగాలంటే పుస్తకాలు తప్పక చదవాలి. దీనికి తోడు సంగీతం, సాహిత్యం కూడా తెలుసుకోవాలి. మంచి పుస్తకాలే గొప్ప నేస్తాలు. మంచి పుస్తకాలను పిల్లలతో చదివించే వారు గొప్ప తల్లిదండ్రులు. పిల్లలను పుస్తకాల దగ్గరకు తీసుకెళ్లే వారు ఇంకా గొప్ప తల్లిదండ్రులు, గురువులు. పిల్లలు మంచి పుస్తకాలు చదవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది.

- కోట పురుషోత్తం, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు



పుస్తక పఠనంతో సృజనాత్మకత

పుస్తకం చదివితే వ్యక్తిత్వ వికాసం పెరుగుతుంది. సృజనాత్మకత ఏర్పడుతుంది. ఇందువల్ల తొలి మొగ్గలు (కవిత్వం), పసిడి మొగ్గలు (కథలు), బాల కథా నిధి, కర దీపిక (మహనీయుల గాథలు) వంటి పుస్తకాలు తెచ్చాం. ఇలా రాబోయే తరానికి విలువలు అందించాలని ప్రయత్నిస్తున్నా. పాఠశాల స్థాయిలో పుస్తకం.. పద్యం.. కవితా పఠనంచేస్తే ఫలితాలు సాధించవచ్చు.

- డాక్టర్ నెమిలేటి కిట్టన్న, తెలుగు ఉపాధ్యాయుడు, మంగళం ట్రెండ్స్ స్కూల్

రాయితీపై బిందు సేద్యం పరికరాలు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాయితీపై బిందు సేద్యంపరికరాలు పొందవచ్చని జిల్లా సూక్ష్మనీటిపారుదల అధికారి సతీష్ తెలిపారు. ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90శాతం రాయితీ ఇస్తామన్నారు. 5 నుంచి 10 ఎకరాలున్న వారికి 70శాతం రాయితీ ఇస్తామన్నారు. ఐదు ఎకరాలున్న సన్నచిన్నకారు రైతులకు స్ప్రింకర్ పరికరాలపై 55శాతం, 5నుంచి పది ఎకరాలుంటే 45 శాతం రాయితీ పొందవచ్చునన్నారు. డ్రిప్, స్ప్రింకర్లు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, తహసీల్దారు ధ్రువీకరించిన భూమి యాజమాన్యపత్రం లేదా 1బీ రికార్డుతో రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన వివరించారు.

వెదురుసాగుకు రాయితీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెదురు సాగు ప్రోత్సాహానికి రాయితీలు ఇస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు రంగంలో సాగు చేసేవారికి 50శాతం రాయితీ ఇస్తామన్నారు. ప్రభుత్వ రంగానికి వందశాతం సబ్సిడీ ఉంటుందన్నారు. నర్సరీ అభివృద్ధికిగాను ప్రైవేటు రంగానికి 50శాతం, ప్రభుత్వ రంగానికి వందశాతం రాయితీ ఉంటుందన్నారు. సీజనింగ్ ప్లాంట్, వెదురు డిపోలు, గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రభుత్వ రంగంలో వంద శాతం, ప్రైవేటు రంగంలో 50శాతంరాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

మందుబాబుల అడ్డా చెక్‌పోస్టు



భీములవారిపాళెం చెక్‌పోస్టు, లోపల ఖాళీ బీరు బాటిళ్లు (ఇన్‌సెట్లో)

తడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడుకాసుల గలగలతో కళకళలాడిన భీములవారిపాళెం చెక్‌పోస్టు నేడు మందుబాబుల అడ్డాగా మారి మద్యం బాటిళ్లతో నిండిపోయింది. 1996లో భీములవారిపాళెం వద్ద రవాణాశాఖ చెక్‌పోస్టు ఏర్పాటు అయ్యింది. 2023 ఆఖరులో రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ చెక్‌పోస్టులను మూసివేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న భీములవారి పాళెం చెక్‌పోస్టు మందుబాబులకు ఆవాసంగా మారిపోయింది. చెక్‌పోస్టు లోపల తాగి పడేసిన మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి.

హామీలను నెరవేర్చే సమర్థత సీఎం చంద్రబాబుకే ఉంది: పాశిం



పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చే సమర్థత సీఎం చంద్రబాబుకే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జనార్ధనరెడ్డి కాలనీలో లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి ప్రతినెలా ఒకటో తేదీనాడే లబ్ధిదారులకు ఇంటివద్దకే వెళ్లి అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గపరిధిలో ప్రతి నెలా రూ.16.57 కోట్ల నగదును లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, చంద్రమౌళి, మోహన్, నరసింహులనాయుడు, రమేష్, శ్రీధర్, అల్లీహుస్సేన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు: విజయశ్రీ



పూసలకాలనీలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేష్, కిషోర్, మాధవనాయుడు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రతి నెలా తొలిరోజునే పింఛన్లు అందజేస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడికే దక్కుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం ఆమె టీడీపీ నాయకులతో కలసి మన్నారుపోలూరు పూసలకాలనీలో పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు త్వరలోనే ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రహ్మణ్యం, సురేష్ నాయుడు, అలవల శ్రీనివాసులు, పాముూరు మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి ఆదిశంకరలో సిల్వర్‌జూబ్లీ వేడుకలు

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహించనున్న సిల్వర్‌జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య అన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆదరణతో ఆదిశంకర కళాశాలను ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ నెల 3వ తేదీ స్థానిక కళాశాలలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక పూజలు, 4న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమురుగదాస్, వంకి అనూష, ధనుంజయ, మోహన్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విభజన రాజకీయాలను సహించం

వాకాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విభజన రాజకీయాలను సహించ బోమని జిల్లా ఉద్యోగ సంఘాల నాయకుడు టి.కృష్ణ అన్నారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ సమాజ చైతన్య సమితితో ఆధ్వర్యంలో మండలంలోని అశోక్‌పిల్లర్, హరిజనవాడ ప్రాంతాల్లో ఇంటింటికి అంబేడ్కర్ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో రంగనాథ్, డాక్టర్ శ్రీనివాసులు, పోలయ్య, సూర్య తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి మిస్టరీని ఛేదించాలి



ప్రవీణ్‌కు నివాళులర్పిస్తున్న పాస్టర్ల సంఘం నేతలు

నాయుడుపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి మిస్టరీని పోలీసులు ఛేదించి నిజాలను నిగ్గుతేల్చాలని పాస్టర్ల సంఘ డివిజన్ అధ్యక్షుడు జోసెఫ్‌రాజు డిమాండ్ చేశారు. మంగళవారం నాయుడు పేట ఆర్మాగం నగర్‌లోని గ్రేస్ కాస్పెల్ జీసెస్ ఫౌండేషన్ చర్చి వద్ద ప్రవీణ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రవీణ్‌కుమార్, విజయ కుమార్, నాగరాజు, అబ్రహం, యేసుదాసు, జేమ్స్, రాజేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు జగన్ అడ్డుపడుతున్నారు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు జగన్ అడ్డుపడుతున్నారని ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేంద్ర విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపిందన్నారు. అయితే శాసనమండలిలో తీర్మానానికి వైసీపీ అడ్డుపడుతోందన్నారు. ఈక్రమంలో ప్రభుత్వం వర్గీకరణకు ఆర్డినెన్స్ తీసుకురానుందని వివరించారు.

అన్న హత్య కేసులో తమ్ముడి అరెస్టు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అన్నను హత్య చేసిన కేసులో తమ్ముడిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ బాబీ తెలిపారు. మార్చి 28వ తేదీన కాపులూరు గ్రామానికి చెందిన వెంకట రమణయ్య మద్యం తాగి వచ్చి భార్య మణెమ్మను కొడుతుండగా తల్లి సరోజనమ్మ అడ్డొచ్చింది. దీంతో తల్లిని కూడా కొట్టడంతో వెంకట రమణయ్యను అతని తమ్ముడు బాబు నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వెంకటరమణయ్య మచ్చుకత్తితో బాబుపై దాడి చేయడానికి ప్రయత్నించగా, ఆ కత్తిని లాక్కున్న బాబు అన్న మెడపై నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం అయ్యప్పరెడ్డి పాళెం జాతీయ రహదారి సమీపంలో బాబును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటపోలూరులో మంగళవారం ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. కోట నుంచి సూళ్లూరుపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు కోటపోలూరు వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సును తప్పించబోయి రోడ్డుకు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

దేవునివెల్లంపల్లి ఈశ్వరయ్యస్వామి

తిరునాళ్లను విజయవంతం చేయాలి

సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనా



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనా

డక్కిలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవునివెల్లంపల్లిలో ఈనెల 14వ తేదీన జరగనున్న స్తంభాల గిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్లను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా కోరారు. మంగళవారం దేవునివెల్లంపల్లిలో నిర్వహించిన స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్ల శాంతి సమావేశంలో సబ్‌కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. తిరునాళ్లలో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సబ్‌కలెక్టరు అధికారులకు వివరించారు. భక్తులు సులభంగా స్వామివారిని దర్శించుకొనేలా ఆలయం వద్ద క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని, శాంతిభద్రతల విషయంలో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దర్శన టికెట్ల కౌంటర్ల వద్ద ఎలాంటి తొక్కిసలాట జరగకుండా క్యూ పద్ధతి పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులకు సబ్‌కలెక్టరు సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను భక్తులకు అంజేసే బాధ్యత దేవదాయ శాఖ అధికారులు చేపట్టాలన్నారు. తిరునాళ్ల నిర్వహణలో గ్రామస్తులు కూడా తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు తిరునాళ్ల ముగిసేవరకు పారిశుధ్య చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే ప్రత్యేక వైద్య శిబిరాలు, రెండు అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారిని కోరారు. భక్తులకు రవానా సౌకర్యం కల్పించాల్సిన ఆర్టీసీ అధికారులు సమావేశంకు హాజరుకాకపోవడం పట్ల సబ్‌కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు సబ్‌కలెక్టర్ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య, సీఐ రమణ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, ఎస్ఐ శివశంకర్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉరుసు ఉత్సవాలు నిర్వహించాలి



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, డీఎస్పీ చెంచుబాబు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని హజరత్ అమిర్షా వలీ దర్గా ఉరుసు ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించే బాధ్యత కమిటీ నిర్వాహకులే తీసుకోవాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. ఈనెల 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు ఉరుసు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నపథ్యంలో మంగళవారం సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో అధ్వర్యంలో గంధోత్సవ కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో పాటు డీఎస్పీ చెంచుబాబు పాల్గొని ఉరుసు నిర్వహణపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎనిమిదేళ్ల తరువాత నిర్వహించే గంధోత్సవాన్ని ఎటువంటి వివాదాలు లేకుండా అందరూ సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో డీజే వంటి కార్యక్రమాలకు అనుమతి లేవని సాంస్కృతిక కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల పాటు ఆగిపోయిన ఉరుసు ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని అందరినీ సమన్వయం పరిచి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, నాయుడుపేట తహసీల్దార్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గర్భకండ్రిగ భూములకు మోక్షం కల్పించండి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, వెంకన్నపాళెం సర్పంచు మధుయాదవ్

కోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వెంకన్నపాళెం గ్రామంలో ఉన్న గర్భకండ్రిగ భూములకు మోక్షం కల్పించి ఆదుకోవాలంటూ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులను మంగళవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కేంద్రమైన వెంకన్నపాళెంలో 364 ఎకరాల పట్టా భూములు 30ఏళ్లుగా గర్భకండ్రిగ జాబితాలో ఉన్నాయని తెలిపారు. దీంతో క్రయ, విక్రయాలు జరిపినా రిజిస్ట్రేషన్లు చేయించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకన్నపాళెం సర్పంచు మధుయాదవ్, రైతులు పాల్గొన్నారు.

జీవనోపాధులకు బాటలు వేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం అనీలా

కోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు జీవనోపాధులకు బాటలు వేసుకునేలా అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎం అనీలా కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం జీవనోపాధులపై సీసీలు, వీవోఏలు, సంఘ బంధం అధ్యక్షురాళ్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అనీలా మాట్లాడుతూ ప్రతి పొదుపు సంఘంలో ఉన్న మహిళ సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు శ్రీకాంత్, ప్రసాద్, భాస్కర్, శంకరయ్య, అలివేలమ్మ, బిందు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో కోటేశ్వరరావు తనను అవమానించారని ఎంపీటీసీ శ్రీదేవి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

చదువులతోనే ఉజ్వల భవిత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన డాక్టర్ రోహిణి

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ రోహిణి అన్నారు. మంగళవారం స్థానిక ఎల్ఏపీ పాఠశాలలో యుకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధించుకునేందుకు కష్టపడి చదివే తత్వాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సుధేష్ణ, మాధవి, దయాకర్‌రెడ్డి, నంద, సురేష్ పాల్గొన్నారు.

ప్రొవిజన్ షాపులో చోరీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని ప్రొవిజన్ షాపులో సోమవారం అర్థరాత్రి దొంగలు పడ్డారు. దుకాణంలో ఉన్న దాదాపు రూ.11 వేలు నగదు, బియ్యం, కందిపప్పు, ఆయిల్ వంటి రూ.30 వేల విలువైన సరుకులు చోరీచేశారు. ప్రొవిజన్ స్టోర్ యజమాని చంద్రబాబు తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సిరామిక్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్‌కు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈనెల 2నుంచి 22వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించి. స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. వివరాలకు 9912342070 నంబరును సంప్రదించాలన్నారు.

నేడు చిట్టమూరులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే

చిట్టమూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో ఎమ్మెల్యేకు తెలియజేయవచ్చన్నారు.

సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రూ.5.07 కోట్ల ఆస్తిపన్ను వసూలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.5.07 కోట్ల ఆస్తిపన్ను వసూలు అయినట్లు కమిషనర్ చిన్నయ్య తెలిపారు. ప్రభుత్వం ఆస్తిపన్ను వడ్డీపై 50 శాతం రాయితీ ఇవ్వడంతో అందరూ ముందుకొచ్చి పూర్తిగా చెల్లించారని, దీంతో గత ఆర్థిక సంవత్సరాని కంటే ఈ ఏడాది రూ.73.71 లక్షలు అధికంగా పన్ను వసూలు అయినట్లు పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే పాశిం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. నియోజకవర్గంలో సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. అలాగే అలాగే చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి ఏప్రిల్ 1: పెళ్లకూరులోని చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఏవో కృష్ణ తెలిపారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో కంటి పరీక్షలు చేస్తామన్నారు. అవసరమైన వారికి అరవింద్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

కోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని మెడికల్ షాపుల్లో మంగళవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని బజారుసెంటర్, ఆర్టీసీ సెంటర్, శ్యామసుందరపురం ప్రాంతాల్లో ఉన్న దుకాణాల్లో మందులు శ్యాంపిల్స్‌ను సేకరించి తీసుకువెళ్లారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

కోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు మొక్కలు నాటి దత్తత తీసుకున్నారు. మంగళవారం హెచ్‌ఎం పేర్నాటి నాగరాజు ఆధ్వర్యంలో జామ, నేరేడు, శీతాఫలం మొక్కలను నాటారు. వాటిని దత్తత తీసుకుని సంరక్షిస్తామని చెప్పారు.



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం నాగరాజు, విద్యార్థులు

ఎకరానికి రూ.1.50 కోట్ల పరిహారం ఇవ్వండి

సబ్‌కలెక్టర్‌కు రైతుల విజ్ఞప్తి

డక్కిలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం నుంచి నాయుడుపేట, శ్రీసిటీలోని పరిశ్రమలకు తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం పైపులైను నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. డక్కిలిలో పైపులైను నిర్మాణానికి తీసుకుంటున్న భూమికి ఇచ్చే నష్టపరిహారం తమకు సరిపోదని రైతులు అభ్యంతరం చెప్పారు. దీంతో మంగళవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా నేరుగా రైతులతో సమావేశం అయ్యారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇస్తామని చెప్పారు. తమ పొలాలు జాతీయ రహదారికి దగ్గరగా ఉండటంతో ఎకరం రూ.1.50 కోట్లు పలుకుతోందని, అంత మొత్తం పరిహారంగా చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఆ ధరకు ఎవరైనా భూమి కొనుగోలు చేసిఉంటే ఆ వివరాలు తెలియజేయాలని సబ్‌కలెక్టర్ కోరారు.

దాడిపై ఫిర్యాదు

తడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కారులో వెళ్తున్న తమపై దాడి చేశారంటూ ఒకరు ఫిర్యాదు చేయగా, తమను ఊరిలోకి వెళ్లకుండా వాహనాలను అడ్డుకున్నారంటూ మరోవర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాటంబేడు గ్రామానికి చెందిన ఆటంబాకం రాజేష్ తన భార్యతో కలసి సోమవారం కారులో చెన్నై వెళ్లారు. సాయంత్రం స్వగ్రామానికి వస్తూ వాటంబేడు రైల్వేగేట్ వద్ద కారు ఆపి కిందకు దిగారు. ఆ సమయంలో వాటంబేడు కుప్పం గ్రామానికి చెందిన కొందరు బైక్‌పై వెళ్తూ రైల్వేగేట్ వద్ద ఆగి రాజేష్ సతీమణితో దురుసుగా ప్రవర్తించారు. ప్రశ్నించిన రాజేష్‌పై దాడి చేశారు. విషయం తెలుసుకున్న రాజేష్ కుటుంబసభ్యులు వాటంబేడు సమీపంలో ట్రాక్టర్లను అడ్డుపెట్టి రాజేష్‌పై దాడి చేసిన వారిని అడ్డుకొని దాడి చేశారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



హర్షిత, నిరోషా

పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి ఏప్రిల్ 1: మండలంలోని మోదుగులపాలెం గ్రామానికి చెందిన గోను హర్షిత, రోసనూరుకు చెందిన పసల నిరోషా రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 4,5,6 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక పోటీలు నాయుడుపేట జడ్పీహైస్కూల్‌లో మంగళవారం జరిగాయి. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి గోను హర్షిత 55 కేజీల విభాగంలో, 8వ తరగతి విద్యార్థి పసల నిరోషా 33కేజీల విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని ఉదయ్‌కుమార్ తెలిపారు.

త్రివిక్రమ అలంకారంలో శ్రీరాముడు



త్రివిక్రమ అలంకారం, వరహా అవతారంలో శ్రీరాముడు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వసంతోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీరాముడు త్రివిక్రమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా బ్రాహ్మణ వీధిలోని సీతారాముల ఆలయంలో వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శ్రీరాముడు వరహా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పండ్ల రసాలు ఎక్కువగా తాగాలి

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు వడదెబ్బకు గురికాకుండా పండ్ల రసాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ సూచించారు. మంగళవారం సెంట్రల్ బస్సుస్టేషన్ ఆవరణంలో ప్రయాణికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయటకు వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ, తలపాగా ధరించాలని సూచించారు. నీరసం, కళ్లు తిరగడం, తలనొప్పి, వాంతులు వంటి వడదెబ్బ లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో నరసింహులు, ఏటీఎం రామచంద్రనాయుడు, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పద్మావతి, డాక్టర్ దీప్తిలావణ్య, కిరణ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు తల్లిపాల నిధి మొదటి వార్షికోత్సవం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోటరీ క్లబ్ సహకారంతో గత ఏడాది ఏర్పాటు చేసిన తల్లిపాల నిధి కేంద్రం మొదటి వార్షికోత్సవం ఈనెల 3వ తేదీన ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు రోటరీ మిల్క్ బ్యాంక్ ప్రాజెక్టు చైర్మన్ దామోదరం తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు.

కాంట్రాక్టు కార్మికుల చర్చలు విఫలం

తిరుపతి(ఆటోనగర్) ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల చర్చలు విఫలమయ్యాయి. సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట 9 రోజులుగా కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న ఆందోళనకు స్పందించిన సంస్థ హెచ్‌ఆర్‌డీ రమణాదేవి నాయకులను చర్చలకు ఆహ్వానించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు లేవని నాయకుడు శివప్రసాద్‌రెడ్డి హెచ్‌ఆర్‌డీ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని విన్నవించారు. ప్రధానంగా జీతాలు పెంచాలని కోరారు. అయితే అవి తమ పరిధిలో లేవని ఆమె బదులిచ్చారు. దీంతో తమ దీక్షలను యథావిధిగా కొనసాగిస్తామని నాయకులు స్పష్టంచేశారు. చర్చల్లో కుమార్, సుదర్శన్, నాగార్జునరెడ్డి, మునికృష్ణ, కిషోర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

● ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



పశువుల తాగునీటి తొట్టె నిర్మాణ భూమి పూజలో ఎమ్మెల్యే తదితరులు

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నాయకులు, అధికారుల సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చెప్పారు. మండలంలో పలు గ్రామాల్లో ఆయన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. మొదటిగా కాంపాళెం, బీఎన్‌కండ్రిగ, పద్మావతిపురంలలో పల్లె పండుగ కార్యక్రమంలో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. బీఎన్‌కండ్రిగలో పింఛన్లు పంపిణీ చేశారు. పద్మావతిపురంలో ఉపాధి పథకంలో మంజూరు చేసిన పశువుల నీటి తొట్టెకు భూమి పూజ చేశారు. బీఎన్‌కండ్రిగ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ బి.రమేష్ యాదవ్, నాయకులు మునిచంద్రనాయుడు, రవినాయుడు, కార్తిక్‌నాయుడు, మునెయ్యనాయుడు, భూపయ్య, బి.గిరీష్‌యాదవ్, సుందరయ్య, మునిరాజా, గోపి, రామనాథం, సర్పంచులు వెంకటమ్మ, చిరంజీవి, మాచాలమ్మ, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, సీఐ తిమ్మయ్య, వ్యవసాయ అధికారి భారతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

కేవీబీపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షలు పూర్తయ్యాయి. మండలంలో మూడు కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు జరిగియి. అంజూరు, కేవీబీపురం, జడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో 478మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా మంగళవారం సాంఘికశాస్త్ర పరీక్షలకు 464 విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ వెంకటకృష్ణయ్య తెలిపారు. ఎస్ఐ నరేష్ బందోబస్తు మధ్య పరీక్షలన్నీ ప్రశాంతంగా ముగిశాయి.

పుత్తూరు వార్తలు

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పుత్తూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పాలిసెట్‌కు ఈనెల 2నుంచి 28వ తేదీ వరకు కళాశాలలో ఉచిత శిక్షణను ప్రారంభిస్తున్నామని పిళ్లారిపట్టు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెన్త్ ఉత్తీర్ణులైన, పరీక్షలు రాసిన అభ్యర్థులందరూ శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి 12.30 గంటలకు వరకు నిర్వహించే శిక్షణలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో మెటీరియల్‌ను శిక్షణార్థులకు ఉచితంగా అందిస్తామన్నారు. ఈనెల 30న జరిగే పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ ఆఖరు అని తెలిపారు. వివరాలకు నెం.9010222155, 8328264905లలో సంప్రదించాలని కోరారు.

అప్పలాయగుంటలో

నేటినుంచి ధ్వజస్తంభ సంప్రోక్షణ



అంకురార్పణ నిర్వహిస్తున్న వేదపండితులు

వడమాలపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయ గుంటలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 2వ తేది నుంచి మూడు రోజుల పాటు నూతన ధ్వజస్తంభ సంప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల్లోగా అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భా గంగా బుధవారం ఉదయం 8 నుంచి 11.15 గంటల వరకు వైదిక కార్యక్ర మాలు, వాస్తు హోమం, సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కళాపకర్షణ నిర్వహించనున్నా రు.ఈనెల 3న గురువారం ఉదయం యాగ శాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు జీవ ధ్వజస్తంభం మహాశాంతి అభిషేకం, పూర్ణాహుతి జరగనుంది. 4న శుక్రవారం ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాల అనంతరం మహా పూ ర్ణాహుతి, కుంభ ప్రోక్షణ శాస్త్రో క్తంగా నిర్వ హించనున్నట్లు డిప్యూటీ ఈవో శ్రీవాణి తెలిపారు.

వైభవంగా అఖండ దీప స్థాపన

వడమాలపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేరివానికండ్రిగలో నూతనంగ నిర్మించిన సిద్ధివినాయక ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మంగళవారం కలశస్థాపన, అఖండ దీప స్థాపన, పుణ్యాహవాచనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడు రోజులుపాటు నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం కలశ పూజ, అగ్నిహోమం, జలధివాసం, క్షీరాధివాసం నిర్వహించనున్నారు. గురువారం విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన, అష్టోత్తర ద్రవ్య సంఖ్యాన గణపతి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రేపు గ్రీవెన్స్ కార్యక్రమం


పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పుత్తూరు పరిధిలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించనున్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఈనెల 3న గురువారం పుత్తూరు మున్సిపాలిటీలోని కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ



పుత్తూరు టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుడుకు పంచాయతీ హరిజనవాడలో సర్పంచ్ పి.వెంకటేష్ ఆధ్వర్యంలో, గోపాలకృష్ణాపురం సర్పంచ్ డి.వేలాయుధం ఆధ్వర్యంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పశువుల దాహం తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో రమేష్‌బాబు, ఉపాధి హామీ ఏపీవో మమతారాణి, జేఈ కిరణ్, టీఏ బాలకృష్ణ, క్షేత్ర సహాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నూతన కమిటీ

శ్రీనివాసులు - వెంకటేష్

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా మహాసభ యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప ముఖ్య అతిథిగా పాల్గొని రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన పోరాట కర్తవ్యాల గురించి ప్రస్తావించారు. అనంతరం జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్‌డీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా మధు, సురేష్, ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా డి.అరుణాచలం, ఎస్.రఘు, ప్రభాకర్, ఎస్. వెంకటయ్యను, కమిటీ సభ్యులుగా మల్లికార్జున, విఘ్నేష్, మురుగేష్ తదితరులను ఎన్నుకున్నారు.

పాముల బెడద



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాముల బెడద అధికమైంది. మంగళవారం బత్తలవారికండ్రిగలో ఓ నివాస గృహంలో నాగుపాము దూరింది. శ్రీకాంత్ అనే వ్యక్తికి గృహ యజమాని సమాచారం ఇవ్వగా పట్టుకుని దూరంగా వదిలేశాడు. గడిచిన నెల రోజుల్లో 10 నాగుపాములతో పాటు 7 రక్తపింజరిలను పట్టుకుని దూరంగా వదిలేశాడు. ముఖ్యంగా ఎన్జీవో కాలనీ, జెండామాను వీధి, ఆర్బీసీకాలనీ, గేటు పుత్తూరు తదితర ప్రాంతాల్లో పాముల సంచారం ఎక్కువగా ఉన్నట్లు ప్రజలు వాపోతున్నారు. మండు టెండలు సహా ఆహారం కోసం వస్తుంటాయని శ్రీకాంత్ తెలిపారు. అటవీశాఖలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేసిన శ్రీకాంత్ ప్రస్తుతం స్వచ్ఛందంగా పాములను పట్టి దూరంగా వదిలి పెడుతున్నాడు.

శ్రీకాళహస్తి సత్యవేడు

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

సత్యవేడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పాలిసెట్ రాయనున్న టెన్త్ విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఉషాదేవి తెలిపారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు కళాశాలలో ఈనెల 3వ తేదీ నుండి 28వ తేదీ వరకు కోచింగ్ ఇస్తున్నట్లు వివరించారు.

షాదీమహల్‌కు సొబగులు





షాదీమహల్ ప్రాంగణంలో భూమి చదును పనులు - షాదీమహల్‌కు పెయింటింగ్ - విద్యుద్దీపకాంతులతో కల్యాణమండపం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈదులగుంట ఈద్గా ప్రాంగణంలో ఉన్న షాదీమహల్ సొబగులు అద్దుకుంటోంది. దీనిపై శ్రీకాళహస్తిలో బొజ్జల కుటుంబం చేసిన అభివృద్ధి కంటికి కనిపిస్తోందని పలువురు ముస్లింలు కొనియాడుతున్నారు. ఈదుల గుంట, అయ్యలనాడు చెరువులో ఈద్గాలకు స్థలాలు కేటాయించి అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ముస్లింల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. ఆయన తనయుడు ఎమ్మెల్యే సుధీర్ ఆ వారసత్వాన్ని కొనసాగించి ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని చెప్పారు. గోపాలకృష్ణారెడ్డి తరువాత ముస్లిం సంక్షేమం ప్రకటనలకే పరిమితమైందే కానీ కంటికి కనిపించలేదన్నారు. ప్రస్తుతం సుధీర్ రాకతో మళ్లీ పరుగులు పెడుతోందన్నారు. అసెంబ్లీ వేదికగా ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై స్వరం వినిపించడం ఇందుకు నిదర్శనమన్నారు.

ఇక రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈదులగుంట ఈద్గాను సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా కొత్త నమాజ్ గోడను సంప్రదాయప్రకారం ఆకర్షణీయంగా నిర్మించారని తెలిపారు. దుస్థితి లో కొట్టుమిట్టాడుతున్న ఈద్గా ఆవరణలోని షాదీ మహల్‌కు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మొత్తంగా ఇప్పటి వరకు ఈద్గా అభివృద్ధి పనులకు రూ.50లక్షలు వెచ్చించారని తెలిపారు. చేయాల్సిన అభివృద్ధి పనులు చాలా ఉన్నాయని ఇఫ్తార్ విందు సందర్భంగా ఎమ్మెల్యే చెప్పడంతో ముస్లింల సంక్షేమానికి శ్రీకాళహస్తిలో మంచి రోజులు వచ్చాయన్నారు.

మహిళాభ్యున్నతే ధ్యేయంగా పని చేయండి

ఎన్యుమరేటర్లకు డీఆర్‌డీఏ పీడీ సూచన



సమావేశంలో సూచనలిస్తున్న శోభన్‌బాబు

పిచ్చాటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతే ధ్యేయంగా వెలుగు సిబ్బంది, ఎన్యుమరేటర్లు పని చేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు పిచ్చాటూరు వెలుగు కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు జరుగుతున్న వార్షిక రుణ జీవనోపాధుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 5 మహిళా సంఘాలకు ఒక ఎన్యుమరేటర్ ఉన్నారని వారి ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు సంఘాలకు చేరాల్సి ఉందన్నారు. ఎన్యుమరేటర్లు వారి పరిధిలోని సంఘాల్లో లోటు పాట్లను గుర్తించి సరి చేయడంతో పాటు సంఘాల్లోని సభ్యుల వివరాలను సర్వే చేసి వారికి ఇచ్చిన మొబైల్ యాప్‌లో సమగ్రంగా పొందుపరచాలన్నారు. ఈ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయడానికి ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్నామని వెల్లడిం చారు. అంతకు ముందు కీళపూడిలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారిని పీడీ దర్శించుకున్నారు. వెలుగు ఏపీఎం చంద్రకళ, సీసీలు సుబ్రహ్మణ్యం, రజని, నాగేంద్రరావు, వీవోఏలు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి మహిళా సంఘాల వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళిక తయారీపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. వెలుగు ఏపీఎం మునెయ్య మాట్లాడుతూ... ఒక కుటుంబం ఒక జీవనోపాధి లక్ష్యానికి అనుగుణంగా గ్రామ సంఘం అసిస్టెంట్లతో స్వయం సహాయక సంఘాల్లో టెన్త్ ఆపైన చదువుకుని ఆసక్తి కలిగిన మహిళలను గుర్తించి వారికి శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటరమణ, సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

భావనారుషి ఉత్సవాలకు గణపతి పూజ

నారాయణవనం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగళం ఉత్తరంలో కొలువై ఉన్న భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయ ఉత్సవాలు గణపతి పూజతో ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం ఆలయంలో మూలవర్లకు అభిషేకాలు చేసి నిత్యకైంకర్యాలు, మహా నైవేద్యం సమర్పించారు. సాయంత్రం విఘ్నేశ్వర పూజ, యాగశాలలో హోమాది కార్యక్రమాలు చేపట్టారు. ఉభయదారులుగా పూల వరద రాజులు శెట్టి, గీత వ్యవహరించగా, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పశువుల దాహార్తి తీర్చడానికే నీటితొట్టెలు

నారాయణవనం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా దాహార్తి తీర్చడానికి నీటితొట్టెల ఏర్పాటులో భాగంగా నారాయణవనంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పశువుల నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలకు తాగు నీరు అందించడం సామాజిక బాధ్యత అన్నారు. పశువులకు నీటి తొట్టెలను నిర్మించి, వాటిలో ఎల్లవేళలా నీరు ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ జయరాములు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీలో ఎస్సీలకు పెద్దపీట

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వైసీపీలో ఎస్సీలకు పెద్దపీట వేస్తారని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. నియోజకవర్గ వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన పసల కృష్ణయ్యను ఆయన తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అధికారంలో లేనప్పుడే పార్టీని కాపాడుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. వి.కృష్ణారెడ్డి, మున్నారాయల్, జయశ్యాం, శరవణకు మార్, కంఠా ఉదయ్‌కుమార్ సురేష్, హరినాథ్‌నాయుడు, పఠాన్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన స్కూల్ బస్సు

మండుటెండలో విద్యార్థుల తిప్పలు



బస్సును నెట్టుతున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూల్ బస్సు నడిరోడ్డులో మొరాయించింది. మండుటెండలో విద్యార్థులే బస్సును తోసుకుంటూ ముందుకు జరపాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఘటన పట్టణంలోని జయరామరావువీధిలో జరిగింది. ఇది చూసిన స్థానిక ప్రజలు పాఠశాలల బస్సుల కండీషన్‌పై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. కాగా దీనిపై పోలీసులు సంబంధిత పాఠశాల నిర్వాహకులు, డ్రైవర్‌ను పిలిపించి హెచ్చరించి పంపారు.

బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకోండి



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ స్వాతికి సీపీఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ... ప్రభుత్వ లైసెన్సు ఉన్న మద్యం దుకాణాలనుంచి ప్రతి పల్లెకు విచ్చలవిడిగా మద్యం యథేచ్ఛగా విక్రయిస్తున్నా రన్నారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించిన సీఎం చంద్రబాబు మాటలను కూడా పెడచెవిన పెట్టి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ అధికారులు, కలెక్టర్ స్పందించి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బెల్టు దుకాణాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శివకుమార్, శ్రీనివాసులు, ప్రజానాట్య మండలి నాయకులు చారుశీల, గురవయ్య, ఏఐటీయూసీ నాయకులు మురళి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


ఇరిగేషన్ ఈఈ సేవలు చిరస్మరణీయం



మదనగోపాల్‌ను సన్మానిస్తున్న ఆదిమూలం తదితరులు

పిచ్చాటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖలో ఈఈగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన మదనగోపాల్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఆదిమూలం కొనియాడారు. మంగళవారం శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఈఈకి శాలువ కప్పి, గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజకవర్గంలో అరణియార్, కాళంగి వంటిపెద్ద ప్రాజెక్టులతో పాటు చిన్న చెరువులు అభివృద్ధిలో మదనగోపాల్ కీలకపాత్రను పోషించారన్నారు. ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, జయచంద్రనాయుడు, మునిచంద్రనాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న తహసీల్దారు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు హెచ్చరించారు. తొట్టంబేడు పంచాయతీ రామచంద్రాపురంలోని సర్వేనెం.89/1లో 1.24ఎకరాల గుంట భూమి ఉంది. దీనిపై ఆక్రమార్కులు కన్నేశారు. కబ్జాదారుల నుంచి కాపాడేందుకు మంగళవారం తహసీల్దారు సిబ్బందితో కలిసి సంబంధిత భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఈ భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందిందని తెలిపారు.

ఇంటి పట్టాల కోసం వినతి

పిచ్చాటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం మంజూరు చేయాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు పిచ్చాటూరు ఎస్టీకాలనీ మహిళలు మంగళవారం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత నెల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోవడంతో రోడ్డున పడ్డామని మొర పెట్టుకున్నారు. బాలికల పాఠశాల రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిమూలానికి మహిళల పరిస్థితి స్థానిక నాయకులు వివరించారు. అక్కడే ఉన్న తహసీల్దార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరారు.

కొండకు నిప్పు



రేణిగుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శేషాచలం కొండల చివరి భాగం వెంకటా పురం, కంకంబాడి కొండకు మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. కరకంబాడి కొండ వెనుక వైపునకు మంటలు వ్యాపించాయి. వెంకటాపురం కొండ అంటుకోవడంతో ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



నాగలాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీపీకోటలో రంజాన్ పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. టోర్నీలో ఆరు జట్లు పాల్గొనగా ఏ ప్లస్, సీ టీం ఫైనల్‌కు చేరాయి. ఇందులో సీ టీం విజయం సాధించింది. విజేతలకు సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, మాజీ సర్పంచులు షాబుద్దీన్, మనోహర్, గ్రామ పెద్దలు బహుమతులు అందించారు.

ఫ్యాప్టో నిరసనను విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్ వద్ద బుధవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించే నిరసనను విజయవంతం చేయాలని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యా, పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలకు గండి కొట్టి ఇబ్బందులకు గురి చేసిందన్నారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడు ప్రస్తుత సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రకాల బకాయిలను చెల్లిస్తామని చెప్పారన్నారు. అయితే ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. 12వ వేతనం కమిషన్ నియమించి వెంటనే 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు.